# నల్లగొండ వార్త

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి

మంగళవారం 05, మే 2026 | 16 పేజీలు








## కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

రానున్న 3, 4 రోజులు అకాల వర్షాలు కురిసేందుకు అవకాశం ఉంది

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం

2లో...



## పథకాలపై అన్నదాతకు.. అవగాహన

- రైతు వారం ప్రారంభం
- నోడల్ అధికారులుగా జిల్లా కలెక్టర్లు
- ఈనెల 9 వరకు రైతు వారం నిర్వహణ
- టీజీ ఆర్గానిక్ యాప్ ఆవిష్కరణ
- రైతులకు నేరుగా మార్కెటింగ్ అవకాశాలు

ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట)

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుంది. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం పథకాలను ప్రవేశపెట్టి రైతులకు అవగాహన కల్పిస్తుంది. సబ్సిడీపై యంత్ర పరికరాలు, విత్తనాలు , ఎరువుల పంపిణీ, రైతు భరోసా, రైతు బీమా తదితర పథకాలను ప్రవేశపెట్టి రైతాంగం సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం ఉంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ నేపద్యంలోని ప్రభుత్వ పథకాలు రైతులకు ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తున్నాయి.

2లో..



## మూడో విడత.. ఎప్పుడో!

- ముగిసిన యాసంగి సీజన్
- రైతు భరోసా నిధుల కోసం తప్పని నిరీక్షణ
- స్పష్టతనివ్వని అధికారులు
- అయోమయంలో అన్నదాతలు

యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త :

జిల్లాలో యాసంగి సీజన్ పూర్తయ్యాక కూడా రైతు భరోసా నిధుల మూడో విడతపై స్పష్టత లేకపో వడంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. సాగు పనులు ముగిసినా, పెట్టుబడుల భారాన్ని మోస్తున్న రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. అధికార యంత్రాంగం నుంచి ఖచ్చితమైన సమాధానం రాకపోవడంతో గ్రామాల వారీగా రైతుల్లో అయోమయం నెలకొంది.గత వానకాలం సీజన్‌లో జిల్లాలో 2.33 లక్షల మంది రైతులకు రూ.306.48 కోట్ల రైతు భరోసా నిధులు నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యాయి.

ఆ సమయంలో విడతల వారీగా నిధుల విడుదల జరిగి రైతులకు కొంత ఉపశమనం కలిగింది. అయితే ప్రస్తుత యాసంగి సీజన్‌లో పరిస్థితి భిన్నంగా మారింది. మొత్తం 24.12 లక్షల మంది అర్హులైన రైతులకు గాను సుమారు రూ.192.60 కోట్ల నిధులను మాత్రమే ఇప్పటివరకు ప్రభుత్వం జమ చేసింది. ఇంకా వేలాది మంది రైతులు మూడో విడత కోసం ఎదురుచూస్తున్నారు.యాసంగి సీజన్‌లో వరి, మక్కజొన్న, పప్పుధాన్యాలు సాగు చేసిన

2లో..



## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి

కట్టంగూర్, మే 4, ప్రభాతవార్త

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనలో భాగంగా రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా మనం ముందుకు

2వ పేజీలో..




## హైకోర్టు తీర్పుతో ఇన్‌చార్జి విధానానికి గుడ్‌బై

- హైకోర్టులో ప్రభుత్వానికి చుక్కెదురు
- సహకార సంఘాల్లో పాత కమిటీల పునరాగమనం
- ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సహకార కమిషనర్
- నేడు తిరిగి బాధ్యతలు స్వీకరించనున్న పాత పాలకవర్గాలు

13వ పేజీలో..

## పథకాలపై అన్నదాతకు అవగాహన

### మొదటి పేజీ తరువాయి..

రైతులకు మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు పథకాలపై అవగాహన కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు వారం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాల్లో, క్లస్టర్ గ్రామాలలో రైతు వేదికల్లో రైతు వారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 9 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. రోజుకో కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల్లో అన్నదాతకు పథకాలపై అవగాహన కల్పిస్తారు. సూర్యాపేట జిల్లాలో 23 మండలాలు నల్లగొండ జిల్లాలో 33 మండలాలు యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాలు ఉన్నాయి. మండల కేంద్రాలతో పాటు క్లస్టర్ గ్రామాలలో కూడా రైతు వారం కార్యక్రమం ప్రారంభమైంది. వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు. వ్యవసాయంలో సాగు సస్యరక్షణ చర్యలు సేంద్రియ వ్యవసాయం ఇతర అంశాలపై రైతులకు తెలియజేస్తున్నారు. సోమవారం ఆయా జిల్లాల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల్లో రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ, పౌరసరఫరాల శాఖ వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మొదటిరోజు మట్టి నమూనా ఫలితాల కార్డులను రైతులకు అందజేశారు. ఈనెల 5న ఉద్యానవన, మత్స్యశాఖ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తారు. ఉద్యాన సాగు విస్తీర్ణం పెంపుదల ప్రత్యామ్నాయ పంటల సాగుతో పాటు ప్రభుత్వం అందించే సబ్సిడీలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. పంటల దిగుబడులకు అవసరమైన మార్కెటింగ్ సౌకర్యాలపై కూడా అవగాహన పెంపొందిస్తారు. అధిక దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తారు. ఈనెల 6న బ్యాంకులు, సహకార సంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి బ్యాంకుల ద్వారా రైతులకు అందించే దీర్ఘకాలిక స్వల్పకాలిక పంట రుణాల పై అవగాహన కల్పిస్తారు. అంతేకాకుండా సహకార సంఘాల ద్వారా రైతులకు అందించే సేవలు వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన పెంపొందిస్తారు. ఈనెల 7న నియోజకవర్గస్థాయిలో విద్యుత్తు, రెడ్ కో శాఖల ఆధ్వర్యంలో వ్యవసాయ క్షేత్రాల్లో సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, పీఎం కుసుం వ్యవసాయ యాంత్రీకరణ రుణాలపై ప్రభుత్వ సబ్సిడీ వినియోగం లాభాలపై రైతులకు తెలియజేస్తారు. ఈనెల 8న పశుసంవర్ధక శాఖ మత్స్య నీటిపారుదల శాఖల ఆధ్వర్యంలో పాడి పరిశ్రమ పశుజాతీయ అభివృద్ధి దూడల ప్రదర్శన గడ్డి విత్తనాలు వేసవిలో పశు సంరక్షణపై గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో చెరువులో కలుపు మొక్కల నివారణ వ్యాధుల నివారణ చాపల ఉత్పత్తి పై తెలియజేస్తారు. ఈనెల 9న గ్రామాల్లో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సమర్ధ నీటి విడుదల కోసం గేట్ల నిర్వహణ ఎత్తిపోతల పథకాల మరమ్మతులు కాలువలు చెరువుల్లో కంపచెట్లు గుర్రపు డెక్క తొలగింపు సమతుల్య నీటి వినియోగం కార్యాలయాల పరిశుభ్రతపై రైతులకు అవగాహన కల్పిస్తారు. రైతు వారం కార్యక్రమంలో రైతులంతా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ఇది ఇలా ఉండగా సోమవారము రైతు వారోత్సవాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వికారాబాద్ జిల్లా తాండూరులో ప్రారంభించారు. రైతులతో నేరుగా మాట్లాడడంతో పాటు వివిధ శాఖల సమన్వయం ద్వారా ప్రభుత్వ పథకాలు సాంకేతికతలు సేవలను చివరి రైతు వరకు తీసుకెళ్లడమే ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశం అని మంత్రి పేర్కొన్నారు. వానాకాలం సీజన్లో రైతుల్లో నమ్మకం పెంపొందించేందుకు వారోత్సవాలు దోహదపడతాయన్నారు. జిల్లాల్లో కలెక్టర్లు నోడల్ అధికారులుగా కార్యక్రమాల అమలు పై దృష్టి సారించాలని మంత్రి పేర్కొన్నారు. రైతు వారం ప్రారంభం సందర్భంగా మంత్రి టీజీ ఆర్గానిక్ యాప్ ను ఆవిష్కరించారు. రైతులకు నేరుగా మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ఈ యాప్ ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వము వ్యవసాయ రంగంలో వినూత్న కార్యక్రమాలను ప్రవేశ పెడుతూ రైతాంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగానే రైతు వారం కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతున్నందున రైతులు వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## మూడో విడత ఎప్పుడో..!

### మొదటి పేజీ తరువాయి..

రైతులు ఇప్పటికే పంట కోతలు పూర్తి చేసి మార్కెట్‌కు సరఫరా చేస్తున్నారు. అయితే సాగు సమయంలో తీసుకున్న అప్పులు, ఎరువులు, విత్తనాలు, కార్మిక ఖర్చులు ఇంకా తీరని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రైతు భరోసా నిధులు ఆలస్యమవడం రైతులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను కలిగిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో అప్పుల కోసం రైతులు ప్రైవేట్ సాహుకారులపై ఆధారపడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.ప్రత్యేకంగా చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. బ్యాంకు రుణాలపై వడ్డీలు పెరుగుతుండగా, పంటలకు సరైన ధరలు లభించకపోవడంతో వారు ఆర్థికంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. రైతు భరోసా నిధులు సమయానికి అందితేనే తదుపరి ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం కావచ్చని వారు అంటున్నారు.ఇదిలా ఉండగా, అధికార వర్గాలు మాత్రం నిధుల విడుదలలో ఆలస్యం జరుగడానికి పలు సాంకేతిక, పరిపాలనా కారణాలను చూపుతున్నాయి. భూసర్వే రికార్డుల సరిచూడటం, పంట నమోదు (ఈక్రాప్) వివరాల ధృవీకరణ, ఆధార్‌బ్యాంక్ ఖాతాల అనుసంధానం, అర్హుల జాబితాలో సవరణలు వంటి అంశాల వల్లే ప్రక్రియ నెమ్మదించిందని చెబుతున్నారు. కొందరు రైతుల ఖాతాల్లో సాంకేతిక లోపాల వల్ల డబ్బులు నిలిచిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.గ్రామ, మండల స్థాయిలో రైతులు రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ అధికారులను సంప్రదిస్తున్నా, మూడో విడత ఎప్పుడు విడుదల అవుతుందనే విషయంపై స్పష్టమైన సమాధానం లభించడం లేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించాలని, అర్హులందరికీ త్వరగా నిధులు జమ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు, వ్యవసాయ నిపుణులు రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అవసరమని సూచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులకు నిధులు అందకపోతే విత్తనాలు, ఎరువుల కొనుగోలు కష్టమవుతుందని హెచ్చరిస్తున్నారు. రైతు భరోసా పథకం లక్ష ్యం రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే కావడంతో, నిధుల విడుదలలో ఆలస్యం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు అభిప్రాయపడుతున్నారు.మొత్తానికి, యాసంగి సీజన్ ముగిసిన తర్వాత కూడా రైతు భరోసా మూడో విడతపై స్పష్టత లేకపోవడం జిల్లాలో రైతుల ఆందోళనకు దారి తీస్తోంది. తక్షణమే మిగిలిన నిధులు విడుదల చేసి రైతులకు ఊరట కల్పించాల్సిన అవసరం ఉందని అన్ని వర్గాలు సూచిస్తున్నాయి.ఇప్పటివరకు జమైన నిధుల వివరాలు ఇలా....ప్రస్తుతం వానకాలం సీజన్ లో రెండు విడతలుగా రైతుల ఖాతాలో ప్రభుత్వం ఇలా జమ చేసింది .ప్రభుత్వం అమలు చేస్తున్న డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ (డీబీటీ) విధానం సమర్థవంతంగా అమలవుతోంది. యాసంగి సీజన్ సంబంధించి రెండు విడుత లుగా రైతు భరోసా నిధులను విడుదల చేసింది .మండలాల వారీ గణాంకాల ప్రకారం జిల్లాలో మొత్తం 2,41,290 మంది రైతులకు రూ.192.60 కోట్లకు పైగా నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి.మండలాల వారీగా వివరాలు పరిశీలిస్తే అడ్డగూడూరు మండలంలో 10,494 మంది రైతులకు రూ.9.05 కోట్లు, అలేర్‌లో 11,255 మందికి రూ.9.00 కోట్లు, ఆత్మకూరు (ఎం)లో 13,600 మందికి రూ.11.92 కోట్లు, గుండాల మండలంలో 14,302 మందికి రూ.11.81 కోట్లు, మోత్కూర్‌లో 10,303 మందికి రూ.9.13 కోట్లు, బి.పొచంపల్లి మండలంలో 14,052 మందికి రూ.10.79 కోట్లు పంపిణీ చేశారు.భువనగిరి మండలంలో 17,497 మంది రైతులకు రూ.13.54 కోట్లు, బిబినగర్‌లో 10,652 మందికి రూ.7.43 కోట్లు, చౌటుప్పల్‌లో 14,960 మందికి రూ.12.04 కోట్లు, నారాయణపూర్‌లో 17,646 మందికి రూ.14.15 కోట్లు, రామన్నపేటలో 17,176 మందికి రూ.14.19 కోట్లు చెల్లించారు.వలిగొండ మండలం జిల్లాలోనే అత్యధిక లబ్ధిదారులు, నిధులతో ముందంజలో నిలిచింది. ఇక్కడ 24,353 మంది రైతులకు రూ.20.31 కోట్లు జమయ్యాయి. బొమ్మలరామారం మండలంలో 13,121 మందికి రూ.8.87 కోట్లు, మోటకొండూరు మండలంలో 11,153 మందికి రూ.9.73 కోట్లు, రాజాపేటలో 14,385 మందికి రూ.11.88 కోట్లు, తుర్కపల్లి మండలంలో 15,484 మందికి రూ.10.18 కోట్లు, యాదగిరిగుట్టలో 10,857 మందికి రూ.8.51 కోట్లు పంపిణీ చేశారు.మొత్తం మీద జిల్లాలో 2,41,290 మంది రైతులకు రూ.192.60 కోట్ల నిధులు డీబీటీ విధానంలో నేరుగా జమయ్యాయి.

## కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

**నల్గొండ టౌన్ మే 04, ప్రభాత వార్త:** రానున్న మూడు, నాలుగు రోజులు అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ధాన్యం సేకరణ అధికారులు, కొను గోలు కేంద్రాలనిర్వాహకులను ఆదేశించారు. ఆది వారం రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ధాన్యం సేకరణ పై సోమవారం రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్, మరో మంత్రి వాకిటి శ్రీహరిలతో కలిసి జిల్లా కలె క్టర్లు, ధాన్యం సేకరణ సంబంధిత శాఖల అధి కారులతోవీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు.

నల్గొండ జిల్లాలో ఆదివారం పెద్ద ఎత్తున కురిసిన వర్షానికి ధాన్యం తడిసిన విషయాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి జిల్లా కలెక్టర్ ను అడుగగా, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సమాధానం ఇస్తూ ఆదివారం సాయంత్రం 4.455 గంటల మధ్య గాలితో కూడుకున్న భారీ వర్షం వచ్చిందని, దీని కారణంగా జిల్లాలోని నల్గొండ, మిర్యాలగూడ, హాలియా తదితర ప్రాంతాలలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసిందని, కల్లాలలో ఉన్న ధాన్యం తో పాటు, కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పుకున్నారని, అయినప్పటికీ బలమైన ఈదురు గాలుల కారణంగా టార్పాలిన్లు ఎగిరిపోయి దాన్యం తడిసిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం తడిసిన ధాన్యం ఆరిపోయిందని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద ఉన్న ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వాతావరణ శాఖ సూచనల ప్రకారం రానున్న మూడు, నాలుగు రోజులు అకాల వర్షాలు వచ్చేందుకు అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు . లారీల సమస్య లేకుండా తగినన్ని లారీలు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభమైన వెంటనే రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాల వల్ల ధాన్యం తడవకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. గత సాయంత్రం కురిసిన అకాల వర్షాల వల్ల రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో కల్లాలలో ఉన్న ధాన్యంతో పాటు, కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం తడిసిపోయిందని, రానున్న మూడు, నాలుగు రోజులు కూడా అకాల వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున ఇన్చార్జి మినిస్టర్లు, జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులు అప్రమత్తంగా ఉండి ధాన్యం తడవకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి మే నెల మొత్తం అత్యంత కీలకమైన మాసమని, అందువల్ల పూర్తి క్రమంగా ఉండి ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని ఆదేశించారు. గత రెండు సంవత్సరాలు రాష్ట్రంలో ధాన్యం సేకరణ సవ్యంగా సాగిందని, ఈ సంవత్సర కూడా అదే విధంగా నిర్వహించాలని, జిల్లా కలెక్టర్లు ముందే వాతావరణ శాఖ నుండి వెదర్ రిపోర్ట్ తెప్పించుకొని ధాన్యం తడవకుండా సంసిద్ధం కావాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సంరక్షించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ కు హాజరైన రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఆదివారం తన నియోజకవర్గంలో సైతం పెద్ద ఎత్తున వర్షం రావడం జరిగిందని, దీనివల్ల ధాన్యం తడిసిపోయిందని, గడచిన రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం అత్యధికంగా ధాన్యం దిగుబడులు వచ్చాయని, దీని దృష్టిలో ఉంచుకొని ట్రాన్స్పోర్ట్ సమస్యలు రాకుండా చూడాలని, గన్ని బ్యాగుల సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్లు సంబంధిత ఇంచార్జ్ మంత్రులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని, జిల్లా కలెక్టర్లు ధాన్యం కొనుగోలు పై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి మొదులుకొని పైస్థాయి వరకు ధాన్యం కొనుగోలను పర్యవేక్షణ చేయాలని చెప్పారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సంక్షేమ శాఖ మంత్రి ఆడ్లూరు లక్ష ్మణ్ కుమార్ మాట్లాడారు.జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, పౌరసరఫరాలు, ట్రాన్స్పోర్ట్ అధికారులు, మార్కెటింగ్ శాఖ ఏడి చాయ దేవి, తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయం, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సాగుతున్నామని నకిరేకల్ వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి తెలిపారు. సోమవారం కట్టంగూరు మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు రసాయనిక ఎరువులతో నిండిన ఆహారమని, ఈ పరిస్థితిని మార్చడానికి, మన నేలతల్లిని కాపాడుకోవ డానికి సేంద్రియ వ్యవసాయం ఒక్కటే సరైన మార్గమని తెలిపారు. సేంద్రీయ ఉత్పత్తుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం, వాటికి మెరుగైన మార్కె టింగ్ సౌకర్యాలు కల్పించడం వ్యవసాయ మార్కెట్ కమిటీల బాధ్యత అని తెలిపారు. అ మండల వ్యవసాయ అధికారి ఎడ వల్లి గిరిప్రసాద్ రైతుల ఉద్దేశించి పంటలలో ఎరువులు యాజమాన్యం నేల ఆరోగ్యం సమీకృత వ్యవసాయం వరిలో సన్న రకాల సాగులో ఆమోద యోగ్యమైన వంగడాలు గురించి అలాగే సేంద్రియ వ్యవసాయం పద్ధతులపై రైతులకు వివరించారు.

ఉద్యానవన అధికారి శ్వేత మాట్లాడు తూ పండ్లతోటలు కూరగాయలు ముఖ్యంగా ఆయిల్ ఫామ్ సాగు వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పెరమాళ్ళ జ్ఞాన ప్రకాష్రావు, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గుండు పరమేష్ గౌడ్, బండారు కృష్ణ, కట్టంగూర్ పిఏసిఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, పిఏసిఎస్ సీఈవో బండ మల్లారెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎడవల్లి గిరి ప్రసాద్, ఉద్యానాధికారి శ్వేత, ఆదర్శ రైతు శాస్త్రవేత్త పుట్ట జనార్దన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు పరశురాములు, నవీన్, రమణ, ఎరువుల షాపు డీలర్లు, కృషి సఖిలు, రైతులు పాల్గొన్నారు.

# నల్గొండలో విషాదం

# నీటిపారుదల శాఖ ఈఈ ఆత్మహత్య

**నల్గొండ రూరల్ మే 03, ప్రభాత వార్త:**



నల్గొండ పట్టణంలోని గంధంవారి గూడెం నీటిపారుదల శాఖ డివిజన్6 లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న సతీష్ చంద్ర యాదవ్ (54) ఆకస్మిక మరణం జిల్లా వ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం పరిధిలోని చందనపల్లి సమీపంలో గల ఢీ37 కాలువలోకి దూకి ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం విధులకు వెళుతున్నట్లు బయలుదేరిన ఆయన చందనపల్లి వద్దకు చేరుకోగానే ఎవరు లేని సమయం చూసి ఒక్కసారిగా కాల్వలోకి దూకారు. నిరంతరం ప్రవహించే నీటి ఉధృతికి ఆయన క్షణాల్లో కొట్టుకుపోవడంతో స్థానికులు అప్రమత్తమయ్యే లోపే ప్రమాదం జరిగిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సహాయంతో గంటల తరబడి శ్రమించిన అనంతరం మృతదేహాన్ని వెలికి తీశారు. విధి నిర్వహణలో ఎంతో సౌమ్యుడిగా నిబద్ధతగల అధికారిగా పేరు ఉన్న సతీష్



చంద్ర ఇలాంటి నిర్ణయం తీసుకోవడం తోటి ఉద్యోగులను కుటుంబ సభ్యులను శోకసముద్రంలో ముంచేసింది. అయితే ఆయన ఆత్మహత్యకు గల కారణాలు ప్రస్తుతం మిస్టరిగా మారాయి. వ్యక్తిగత సమస్యల వల్ల ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా? లేక ప్రాజెక్టు పనులకు సంబంధించి ఏమైనా ఒత్తిళ్లు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలం నుంచి సతీష్ చంద్ర మొబైల్ ఫోను స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆయన చివరిగా ఎవరితో మాట్లాడాలని కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం మొత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సమగ్ర విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఉన్నత స్థాయి అధికారి ఆత్మహత్య చేసుకోవడం జిల్లా అధికార యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది

## నేరాలు-దారుణాలు

# ఉద్యోగం పేరిట లక్షల మోసం

### నార్కట్‌పల్లిలో ఘటన..

### కేసు నమోదు

**నార్కట్‌పల్లి, ప్రభాతవార్త మే 04** నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు వసూలు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపినవివరాల ప్రకారం, నకిరేకల్ గ్రామానికి చెందిన కాతోజు నరేంద్ర చారి (తండ్రి: యాదగిరి), నార్కట్‌పల్లి మండలం అక్కేనపల్లి గ్రామానికి చెందిన ఎస్కే. జహంగీర్ (తండ్రి: నజీర్, 35)కు ఎం ఎస్ ఎం ఈ అనే అవుట్‌సోర్సింగ్ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1,04,000 వసూలు చేసినట్లు తెలిసింది.అయితే, బాధితుడికి ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం డబ్బులు తిరిగి ఇవ్వమని అడగగా, మరో రూ.1,00,000 ఇస్తే దేవాదాయ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని మళ్లీ నమ్మబలికినట్లు సమాచారం.ఈ విషయమై బాధితుడు నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పి. విష్ణుమూర్తి తెలిపారు. అప్రమత్తంగా ఉండాలి పోలీసులు ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై పి. విష్ణుమూర్తి ప్రజలకు సూచించారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**నకిరేకల్, మే 4, ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా నకిరేకల్ పట్టణంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రైతు వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక అని, రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, వాటి ప్రయోజనాలను వివరించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి పట్ల ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటుతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడం, సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడం, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# జాతరలు మన సంస్కృతికి ప్రతీకలు

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**నకిరేకల్, మే 4, ప్రభాతవార్త :** జాతరలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలంలోని నెల్లిబండ గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ లింగమంతుల స్వామి జాతర మహోత్సవంలో ఆయన పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తమవంతు సహకరిస్తామని అన్నారు. పెద్దలు అందించిన ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. జాతరల ద్వారా గ్రామీణ కళలు, జానపద సంప్రదాయాలు వెలుగులోకి వస్తాయని, వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. భక్తులందరికీ స్వామి వారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలందరూ స్వామివారి దయతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.



# గాలివాన బీభత్సం..

### నిరాశ్రయులైన కుటుంబాలకు అండగా సర్పంచ్



**నకిరేకల్, మే 4, ప్రభాతవార్త :** నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సానికి పలు ఇళ్లు దెబ్బతిని నిరుపేద కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ఈ ఘటనలో శిరిషాల మహేష్‌కు చెందిన పూరిగుడిసె పూర్తిగా కూలిపోవడంతో పాటు ఇంటిలోని నిత్యావసర వస్తువులు తడిసి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ గాధరి జయమ్మరాఘవులు దంపతులు ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సహాయంగా బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. అలాగే గాలివానలో దెబ్బతిన్న జంపాల బిక్షం, గుడిపాటి వెంకన్న, సందినేని కిషన్‌రావుల ఇళ్లను పరిశీలించి బాధితులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, రైస్ మిల్లును సందర్శించి రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందిని చెప్పారు. గ్రామంలో కూలిపోయిన ఇళ్లు, దెబ్బతిన్న విద్యుత్ స్థంభాల పునరుద్ధరణపై రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బచ్చుపల్లి రామలింగారావు, వార్డు సభ్యులు కొప్పుల వెంకన్న, కందికంటి సైదమ్మవెంకన్న, మంద నాగరాజు, రాచమళ్ల పద్మజ, కట్టా మాధవిదన్‌రాజ్, చింతల వీరయ్య, బొల్లెద్దు తేజశ్వినినాగరాజు, పూల రమాదేవిసతీష్, రాచమళ్ల సైదులు, గ్రామశాఖ అధ్యక్షుడు పూల శ్రీకాంత్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ గొడ్డేటి సైదులు, బచ్చుపల్లి రాంకిషన్‌రావు, పార్టీ నాయకులు నకిరేకంటి అంజయ్య, కందికంటి యల్లయ్య, కల్లేం ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

# నరసింహునికి

# ఘనంగా పవళింపు సేవ

**మఠంపల్లి. మే 4 ప్రభాతవార్త:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన సోమవారం స్వామివారికి పుష్పయాగం పవళింపు సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యాజిక సహాయకులు హరి కిరణా చార్యులు దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, శ్రీనివాసచార్యులు ఫణిభూషణమంగాచార్యులు పద్మనాభచార్యులు బద్రి నారాయణ చార్యులు లక్ష్మీ నరసింహమూర్తి వారలచే పుష్ప యాగం కార్యక్రమాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. సాయంత్రం శ్రీ స్వామివారికి ద్వాదశ సేవలు శృంగార డోలోత్సవం పవళింపు సేవా కార్యక్రమాలు వేదమంత్రాలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు ఇట్టి కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్ కుమార్, ఆలయ కార్యనిర్వాహణాధికారి బి జ్యోతి సిబ్బంది భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# గాలి దుమారం బీభత్సం..

### సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు



**నకిరేకల్, మే 4, ప్రభాతవార్త :** నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో సోమవారం సాయంత్రం వీచిన గాలి దుమారం, వడగళ్ల వానతో పలు చెట్లు విరిగి, విద్యుత్ స్థంభాలు కూలి రోడ్లపై పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా డ్రైనేజీలు చెత్తతో నిండిపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, స్థానిక కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ తక్షణమే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి విద్యుత్ అంతరాయాన్ని తొలగించేందుకు చర్యలు చేపట్టించారు. అలాగే మున్సిపల్ సిబ్బందితో కలిసి డ్రైనేజీలను శుభ్రపరచి, రోడ్లపై పడిన చెట్లను తొలగించే పనులు వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే సమస్యలను పరిష్కరించడం ప్రాధాన్యతగా తీసుకుంటామని తెలిపారు. ప్రజల సహకారంతో శుభ్రత, పారిశుద్ధ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం సమస్యల పరిష్కారంలో సహకరించిన విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATIOR MEDCHAL-MALKAJGIRI DIST AT: MEDCHAL.**
**ABR.CF NO: 257 OF 2025**

Between :
**M/s. KAPIL CHITS (HYD) PVT. LTD.**
KHYT17P-15, HABSIGUDA-2 BRANCH.
**...DISPUTANT**
AND
**Mr. K. GOPINATH & Others**
**....OPPONENTS**

To,
**1. Mr.Gopinath Karamtoth,** S/O. Bansilal, Aged About: 32 Years, Occ: Business R S. Supermarket Hayathnagar, Rangareddy, Telangana R/O: HNO-8-19, Dubba Thanda Chilapuram Narayanapur, Nalgonda Dist., Telangana, India 508253.
**2. Mrs.Sheela Bai Keloth,** W/O. Bhajana, Aged About: 39 Years, Occ: Secondary Grade Teacher Emp Id. 1470891 Secondary Education, Secretariat Dept., Govt Of T S, P S Saroornagar, R R Dist, Hyderabad, Ts.R/O: Plot No. 86, 87 Road No. 05, Shivam Hills Bommalagudi, Hayathnagar, Hyderabad, Telangana, India, 501505.
**3. Mr.Pandu Karantothu,** S/O. Balu, Aged About :46 Years, Occ: Mechanic2 Staff No. 272982 TSRTC ZWS Uppal, Hyderabad, Telangana .R/O: H No. 6-152, Botimeedi Thanda, Narayanpur Mandal, Jangam Dist Nalgonda, Telangana, India, 508253.
**4. Mr.Raju Vankudothu,** S/O. Soma, Aged About :35 Years, Occ: Proprietor Sai Balaji Stationary Telangana. R/O: H No. 8-18-262, Bhupesh Gupta Nagar, Saroornagar, Vaishalinagar Hyderabad Rangareddy, Telangana, India, 500079.
**5. Mr.Mangtha Karamtoth,** S/O. Lal Singh, Aged About :43 Years, Occ: Asst Supr (INSPN) Emp No.300/5758/105454 Hindustan Aeronauticals Ltd., Balanagar, Hyderabad, Telangana .R/O: H No. 2-52/3, SB H Colony, Munuganoor, Hayathnagar, Hyd Rangareddy, Telangana, India, 501505.
**6. Mr.Bhajana Karamtoth,** S/O. Jagna, Aged About :47 Years, Occ: Scientific Assistant E, Accounts Division, Emp No. 6494 Nuclear Feul Complex Govt Of India, Hyderabad, Telangana .R/O: Plot No.86 And 87 Road No. 05, Shivam Hills, Hayathnagar Hyderabad, Telangana, India, 501505.
**7. Mrs.Shilpa Karamtoth,** W/O. Gopinath, Aged About :30 Years, Occ: Ps Wife Surety.R/O: H No. 8-19, Dubba Thanda, Narayanpur Mandal, Chilapuram Nalgonda Dist., Telangana, India, 508253.
**8. Mr.Bodraboina Narsimha,** S/O. Durgaiah, Aged About :44 Years, Occ: Secondary Grade Teacher Emp Id. 1956779 Secondary Education, Secretariat Dept., Govt Of Telangana Zphs Nampally Hyd Telangana .R/O:H No. 3-3., Jangaon Nalgonda, Telangana, India, 508252.
**9. Mr.Karamtothu Ravinder Naik,** S/O. Ramkoti, Aged About :43 Years, Occ: Proprietor Anjali Eggs Wholsale And Traders Telangana R/O:H No 5-6, Sundaraiah Colony, Choutuppal, Bhongir Yadadri Dist., Bhuvanagiri, Telangana, India, 508116.

Whereas the above named disputant has instituted a suit against you for recovery of money of **Rs.4,52,280/-** You are hereby summoned to appear in the above arbitration in person or by an advocate duly instructed On **12-05-2026** the at 01.00 P.M filing which the matter will be decided exparte in accordance with law.

//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**J. SRINIVAS REDDY,**
**Advocate,**
Hyderabad.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**నడిగూడెం, మే 4, ప్రభాతవార్త:**
అధిక దిగుబడినిచ్చే మేలు రకం వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్ అన్నారు. స్థానికంగా సోమవారం రైతు వారం కార్యక్రమాన్ని నిర్వహించగా ఆమె మాట్లాడారు. మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడి పొందవచ్చు అన్నారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. భూసార పరీక్షల ప్రాధాన్యత వివరించారు. ప్రభుత్వము మంచి ఉద్దేశంతో రైతు వారం కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూసార పరీక్షల కార్డులను రైతులకు అందజేయడంతో పాటు ఫలితాలకు అనుగుణంగా ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయం చేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు అన్నారు. అధిక యూరియా వాడడం వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం పై వివరించారు. సర్పంచ్ దున్న శ్రీనివాస్ మాట్లాడుతూ నానో యూరియా



వినియోగం పై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి మల్సూర్ ప్రభుత్వము ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలపై రైతులకు వివరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పిచ్చయ్య, రైతులు అనంతరెడ్డి, గోపి, వెంకన్న, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ సరఫరా లో అంతరాయం
## యుద్ధ ప్రాతిపదికపై పునరుద్ధరణకు చర్యలు

**నడిగూడెం, మే 4, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన నడిగూడెం లో ఆదివారం రాత్రి భారీ వర్షం ఈదురుగాలులు సృష్టించిన బీభత్సం ప్రజలను భయాందోళనకు గురిచేసింది. చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటం, విద్యుత్ స్తంభాలు నేల కొరకడంతో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురు గాలులు వీచిన రాత్రి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అధికారులు ఎంత శ్రమించినప్పటికీ ఫలితం కలగలేదు. సోమవారం వేకువ జామున విద్యుత్తు పునరుద్ధరణ పనులు చేపట్టారు. మండలంలోని విద్యుత్ సిబ్బంది అందరూ నడిగూడెం చేరుకొని విద్యుత్తు పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. ట్రాన్స్కో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల విద్యుత్ సిబ్బంది మండల కేంద్రమైన నడిగూడెంలో పనిచేసే యుద్ధ ప్రాతిపదికపై విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. మిషన్లు తెచ్చి చెట్ల కొమ్మలను తొలగించారు. తెగిపోయిన విద్యుత్ తీగల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. కొత్త విద్యుత్ స్తంభాలను కూలిన వాటి స్థానంలో ఏర్పాటు చేసి విద్యుత్తు పునరుద్ధరణకు కృషి చేశారు. మండల ట్రాన్స్కో ఏఈ గణేష్, లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్ మెన్ లు ఎక్కడ విద్యుత్ సమస్య ఏర్పడిందో అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సోమవారం సాయంత్రానికి విద్యుత్తును పునరుద్ధరించారు. నడిగూడెంలో ఎన్నడూ ఇంత భారీ ఎత్తున ఈదురు గాలులు వీచలేదని ప్రజలు అంటున్నారు. భారీగా వర్షము ఈదురు గాలులు



రావడంతో బీభత్సం సృష్టించడంతో ప్రజలు భయాందోళన చెందారు. ఆదివారం రాత్రి నుండి విద్యుత్ లేక సోమవారం సాయంత్రం వరకు వేచి చూచారు. నీటి సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులపై పడ్డ చెట్లను వెంటనే తొలగించి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ దున్న శ్రీనివాస్, కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్, ఉప సర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు కూడా విద్యుత్ శాఖ అధికారులు ,సిబ్బందికి సహకరించి తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు. విద్యుత్ ఘాతానికి గ్రామ వెలుపల వ్యవసాయ పొలాల్లో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామా చేసి నివేదికను ప్రభుత్వానికి పంపుతామని బాధితులకు హామీ ఇచ్చారు. మండలంలోని 15 గ్రామాలలో ఎక్కడా లేని భారీ వర్షం ఈదురు గాలులు నడిగూడెంలో రావడంతో ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఇంత పెద్ద ఎత్తున రావడము ఇదే మొదటిసారి అని ప్రజలు చర్చించుకుంటున్నారు

## ఆధ్యాత్మికతతో మానసికచింతన దూరం

**మునగాల, మే 4, ప్రభాతవార్త**
:ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో మానసికచింతన దూరం చేయవచ్చుని మాజీమంత్రి సినీనటి రోజా అన్నారు.సోమవారంమండల పరిధిలో తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మహా గణపతి సుబ్రహ్మణ్య సహిత రామలింగేశ్వర నందీశ్వర కీర్తిధ్వజ ద్వారా పాలక శిఖర నవగ్రహాముల జంటనాగేంద్రడి స్థిర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈనెల 6వ తేదీన విగ్రహాల ప్రతిష్టకు ముహూర్తాన్ని ఖరారు చేశారు. సోమవారం ఉదయం నుంచి మూడు రోజుల పాటు గ్రామంలో దేవాలయంలో నిర్మించిన నూతన యాగశాల నందు వేదపండితులు అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ముఖ్యఅతిథిగా హాజరైన సినీనటి రోజా ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.విగ్రహాల ప్రతిష్ట ఈనేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న తిమ్మారెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఆడపడుచులు,బంధువులు, కుటుంబసభ్యులువిగ్రహా ప్రతిష్ట కార్యక్రమ నేపథ్యంలో స్వగ్రామానికి తిరిగి రావడంతో గ్రామంలోని ప్రతి ఇంట పండుగ వాతావరణం నెలకొన్నది, విగ్రహా ప్రతిష్టకు గ్రామ పురోహితులు వేదం రంగయ్య శాస్త్రీ, పర్యవేక్షణలో కితావారిగూడెం వాస్తవ్యులు రాయప్రోలు శ్రీ రామయ్య బ్రదర్స్, కోదాడ వాస్తవ్యులు రాళ్ళబండి రాజశేఖర్ బృందంచే పూజలు చేశారు.ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్తలు గ్రామ ప్రజలు మహిళలు యువత యువకులు తదితరులు పాల్గొన్నారు



## అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్



**అనంతగిరి మే 04 ప్రభాతవార్త:**
60 ట్రిప్పులకు పైగా అక్రమంగా నిల్వచేసిన ఇసుకను అధికారులు సీజ్ చేశారు. వివరాల్లోకెళ్తే మండల పరిధిలోని పాలవరం గ్రామ పాలేరు వాగులో కొంత వ్యక్తులు జెసిబి సహాయంతో ఇసుకను తవ్వి నిల్వ ఉంచి అక్రమంగా రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో విషయం తెలుసుకున్న అధికారులు వాగులో చెక్ డ్యాం సమీపానికి చేరుకున్నారు.సుమారు 60 ట్రిప్పులు పైగా నిల్వ చేసిన ఇసుకను చూసి నివ్వెర పోయారు.ఎలాంటి పర్మిషన్ లేకుండా నిల్వ చేసిన ఇసుకను అధికారులు సీజ్ చేశారు.సంబంధిత వ్యక్తులు మాత్రం అక్కడ నుండి పరారీలో ఉన్నట్లు సమాచారం.అనుమతులు లేకుండా పెద్ద మొత్తంలో ఇసుకను విలువచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు 60 ట్రిప్పులకు పైగా నిల్వచేసిన ఇసుక చిలుకూరు మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి సంబంధించినదిగా సమాచారం.అధికారులు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు




## విద్యుత్ ఘాతానికి గేదెలు మృతి



**నడిగూడెం, మే 4, ప్రభాతవార్త:**
విద్యుత్ షాక్ తో రెండు గేదెలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన నడిగూడెంలో చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచాయి. దీంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరిగాయి. మేత మేసేందుకు వెళ్లిన గేదెలకు తీగలు తగలడంతో మృతి చెందాయి. మండల కేంద్రమైన నడిగూడెంకు చెందిన వట్టే సీత పాడి గేద ఒకటి కాగా మరొక గేద ఎవరిదో గుర్తించలేదు. ఒక్కొక్క గేద విలువ సుమారు 80 వేల రూపాయల వరకు ఉంటుందని బాధితురాలు తెలిపారు. నష్టపరిహారము అందజేయాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామ చేశారు.

## 7న కోదాడకు మాజీ మంత్రి హరీష్ రావు

**కోదాడ, మే 4, ప్రభాతవార్త :**
కోదాడలో ఈ 7న గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్న బి ఆర్ఎస్ శ్రేణుల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి శాసనసభ పక్ష ఉప నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడవ తేదీ ఉదయం నియోజకవర్గంలోని మునగాల మండలం తిమ్మారెడ్డి గూడెం లో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ తరువాత పలు ఐకెపి సెంటర్లను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకోనున్నారు. అనంతరం కోదాడ గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్న బీ ఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై దిశా నిర్దేశం చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు

## భూసార పరీక్షలు రైతులకు ఉపయోగకరం

**కోదాడ, మే 4, ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత భూసార పరీక్షలు రైతులకు ఎంతో ఉపయోగకరమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వ్యవసాయ వారోత్సవాల సందర్భంగా మున్సిపల్ పరిధిలోని అల్వాలపురం రైతు వేదికలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. భూసార పరీక్షల వల్ల సదరు భూమి ఏ పంటకు ఉపయోగపడుతుంది, ఆ భూమికి ఏ రకమైన ఎరువులను వినియోగించాలో రైతులకు తెలుస్తుందన్నారు. రైతులందరూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్ పర్సన్ మల్లేశ్వరి, ఆర్డీఓ సూర్యనారాయణ, తహసిల్దార్ వాజిద్ అలీ, కౌన్సిలర్ ప్రసాద్ సై దా నాయక్ పాల్గొన్న ఈకార్యక్రమంలో వంగవేటీ రామారావు మాట్లాడుతూ ఈరోజున ప్రభుత్వము రైతు సంక్షేమము కోసము ఎన్నో కార్యక్రమాలు నిర్వహించు చున్నారని అందులో భాగంగా ఉచితముగా భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారని అన్నారు కుసుమగారు మాట్లాడుతూ రైతులు బాగుంటేనే దేశము బాగుంటుందన్నారు భూసార పరీక్ష ద్వారాఏ ఎరువు వాడలో తెలుస్తుంది అన్నారు వైస్ ఛైర్మన్ మల్లీశ్వరి గారు మాట్లాడుతూ ఈకార్యక్రమముల ద్వారా రైతులు చైతెన్య వంతులు అవుతారని అన్నారు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయం

**ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి**

**హాలియా, ప్రభాతవార్త, మే 4:**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయమని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి అన్నారు. సోమవారం హాలియాలో ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని, మౌలిక వసతుల కల్పన అందులో భాగంగానే 200 కోట్ల రూపాయలతో నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేసి పేదవారికి కార్పొరేట్ విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఫలితాలు రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించి శాలువాలతో సన్మానించారు. బీసీ గురుకులం తుమ్మడం నుంచి శాలిని 583 మార్కులు, కేజీ విబి హాలియా శ్రీవల్లిక 562 మార్కులు, ఎస్సీ గురుకుల అనుముల నుంచి విజయ మోహన్ 558 మార్కులు, జెడ్పిహెచ్ఎస్ యాచారం నుంచి సందీప్ 538 మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి హాలియాలో నూతనంగా ఏర్పాటు చేసిన అభిరుచులు హోటల్లో వారితో కలిసి భోజనం చేశారు. పేరూరు మేజర్ ను ప్రక్షాళన చేస్తా: హాలియాలోని డ్రైనేజీ వాటర్ పేరూరు



మేజర్ లోకి వెళ్లి మేజర్ అంతా మురుగునీరు ప్రవహించడం, దోమలు వృద్ధి చెంది నివాస గృహాల వారు ఇబ్బందులు పడడంతో మేజర్ను ప్రక్షాళన చేయడానికి ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన పనులపై మున్సిపాలిటీ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించి వారితో చర్చించారు. పేరూరు మేజర్ కు లైనింగ్ ఏర్పాటు చేసి, ఇరువైపులా సిసి రోడ్ ఏర్పాటుతో ప్రక్షాళన చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ గౌనీ రాజా రమేష్ యాదవ్, కమిషనర్ రవీందర్ రెడ్డి, గడ్డం సాగర్ రెడ్డి, కాసాని చంద్రశేఖర్, నాయకులు చిట్టిపోలు కరుణాసాగర్, యేసు రాజు, నకిరేకంటి సైదులు, మజార్ మొహిముద్దీన్, ఎడవల్లి రంజిత్ జిహెచ్ఎం నాగిరెడ్డి, ఎస్ ఓ హైమావతి, భవాని, నేర్మటి వెంకటరెడ్డి, పాండు నాయక్, అభినయ్, భాను ప్రకాష్ రెడ్డి, డీలర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో మూడు పాడి గేదెలు మృతి



**నిడమనూరు ప్రభాతవార్త మే 4**

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి చెందిన సంఘటన నిడమనూరు మండలంలోని తుమ్మడం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం రాత్రి గ్రామ శివారు అయిన మారుతి వారి గూడెం లో తుమ్మడం గ్రామానికి చెందిన బత్తుల లింగయ్య యాదవ్ రెండు గేదెలు, ఒక గేద వెన్న మహేందర్ రెడ్డి గేదెలు అకాల ఈదురు గాలులకు వర్షాలకు ఆదివారం రాత్రి కరెంటు వైర్ తగిలి మూడు గేదెలు అక్కడికక్కడే మరణించడం జరిగింది. వాటి విలువరూ. దాదాపు రెండు లక్షల పైనే నష్టపోయామని రైతులు వాపోయారు. పాడి గేదెల ద్వారానే జీవనం గడుస్తుందని నష్టపోయిన రైతులుఅన్నారు. ప్రభుత్వం తమను కుటుంబాలను ఆదుకోవాలని కోరారు

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**చౌటుప్పల్, మే 4 ప్రభాతవార్త**

తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం చౌటుప్పల్ మండల వ్యాప్తంగా ఖిరైతు వారోత్సవాలుఖి ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని 8 రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయం, సన్న రకాల సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. చౌటుప్పల్ రైతు వేదికలో జరిగిన కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రసాయనిక ఎరువుల వాడకం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా మనుషుల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతోందని, రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఆయన కోరారు. ప్రభుత్వం సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తున్నందున, రైతులు నాణ్యమైన ఏగ్రేడ్ రకాలను సాగు చేసి మద్దతు ధర పొందాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామానికి 10 మట్టి నమూనాలను సేకరించి, పరీక్షా ఫలితాలను రైతులకు వివరించారు. భూసార పరీక్షల కోసం గ్రామానికి ముగ్గురు వాలంటీర్లను, ప్రకృతి వ్యవసాయం కోసం ఖికృషి సఖిఖిలను ఎంపిక చేశారని, ఎరువుల అక్రమ రవాణా, కృత్రిమ కొరతను అరికట్టడానికి ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ఖినిఘా సమితిఖిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వానాకాలం సీజన్లో ప్రభుత్వ బోనస్ పొందేందుకు బిపిటి5204, ఆర్ ఎన్ ఆర్ 15048, జై శ్రీరామ్ వంటి సన్న రకాలను సాగు చేయాలని సూచించారు. ప్రైవేట్ హైబ్రిడ్ రకాలు బిగ్రేడ్ కిందకు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్త వహించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో కార్యదర్శి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు శంకరయ్య, వెన్నెల, శ్రావ్య, వెంకటేష్, ఉమ మహేశ్వరి, లక్ష్మణ్, సోని, సౌమ్యశ్రీ, మార్కెట్ డైరెక్టర్లు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు

## ట్రాక్టర్ పై నుంచి పడి వ్యక్తి మృతి



**మిర్యాలగూడ, మే 4 ప్రభాతవార్త**

ట్రాక్టర్ పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మిర్యాలగూడ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... త్రిపురారం మండలం పలుగుతండకి చెందిన పానుగోతు లాలు బంధువుల ఇంట్లో జరిగే శుభ కార్యానికి అదే గ్రామానికి చెందిన ధనావత్ నాగ ట్రాక్టర్ పై వెళ్తున్నాడు. తుంగపాడు సమీపంలో గుంత తప్పించే క్రమంలో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టర్ ఇంజన్ పై కూర్చొని ఉన్న లాలు కింద పడగా అతని పై నుండి ట్రాక్టర్ వెళ్ళగా అక్కడికక్కడే మృతి చెందాడు. దస్లీ అనే వ్యక్తి కి నడుము భాగంలో గాయాలైనట్లు పేర్కొన్న ఎస్సై, లాలు కొడుకు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## హాలియా మున్సిపల్ వార్డులలో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

**హాలియా, ప్రభాతవార్త, మే 4:**



హాలియా మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం సంభవించిన తీవ్ర గాలులు, అకాల వర్షాల కారణంగా పలు వార్డుల్లో భారీ నష్టం చోటుచేసుకుంది. కరెంట్ స్థంబాలు కూలిపోవడం, చెట్లు నేలకూలడం, రహదారులపై చెట్ల కొమ్మలు పడిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని గమనించిన మున్సిపాలిటీ చైర్మన్ శ్చింతల చంద్రారెడ్డి వెంటనే స్పందించి, ప్రభావిత ప్రాంతాలను సోమవారం ఉదయం స్వయంగా సందర్శించారు. ప్రతి వార్డులో పరిస్థితిని పరిశీలిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెట్లు, కొమ్మలు రహదారులకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలు స్తంభించగా, మున్సిపల్ సిబ్బందితో కలిసి వాటిని తొలగించే పనులను వేగంగా చేపట్టించారు. కరెంట్ సరఫరా పునరుద్ధరణకు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట పలు వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు

## పేకాట ఆడుతున్న ఇద్దరి అరెస్ట్

**మిర్యాలగూడ, మే 4 ప్రభాతవార్త**

పేకాట ఆడుతున్న ఇద్దరిని సోమవారం మిర్యాలగూడ గ్రామీణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని దుర్గా నగర్ లో ఒక షట్టర్ వెనక కొంతమంది పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు ఆకస్మికంగా దాడి చేయగా ఇద్దరు పట్టుబడగా మరో ముగ్గురు పారిపోయినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుండి 12,580 నగదు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపిన ఎస్సై పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఆర్డీవో కార్యాలయం ముందు సిపిఎం నాయకులు

**చౌటుప్పల్, మే 4 ప్రభాతవా**

యాసంగి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చౌటుప్పల్ ఆర్డిఓ కార్యాలయం ముందు తెలంగాణ రైతు సంఘం, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రైతులు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చౌటుప్పల్ మండలంలోని చిన్న కొండూరు, పెద్దకొండూరు, మందొల్లగూడెం, నేలపట్ల, జై కేసారం, ఎస్.లింగోటం, పంతంగి, అంకిరెడ్డిగూడెం, తాళ్ల సింగారం, ధర్మోజిగూడెం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా, ఒక్కో సెంటర్లో 70 నుండి 80 వేల బస్తాల ధాన్యం నిల్వ ఉండగా, కేవలం 2వేల నుండి 3వేల బస్తాలు మాత్రమే కొనుగోలు చేశారని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ధాన్యం మొత్తం కొనుగోలు చేయడానికి 3 నుండి 4 నెలల సమయం పడుతుందని, ఈలోపు వర్షాలు పడితే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు కనీసం 3 నుండి 4 లారీల ధాన్యం కొనుగోలు చేయాలని,

మార్కెట్లో మిల్లర్ల వద్ద జరుగుతున్న తరుగు దోపిడీని నిలిపివేయాలని, మార్కెట్ యార్డుల్లో రైతులకు మంచినీరు, విద్యుత్, వాచ్మెన్ టార్పాలిన్ పట్టాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, సిపిఎం నాయకులు చీరిక అలివేలు, ఎండి పాషా, బండారు నరసింహ, పొట్ట శ్రీను, ఆకుల ధర్మయ్య, చప్పిడి రాఘవరెడ్డి, బోరం నర్సిరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.



## యువతి అదృశ్యం

**మిర్యాలగూడ, మే 4 ప్రభాతవార్త**



యువతి అదృశ్యం అయిన సంఘటన మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ గ్రామీణ ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం....గ్రామానికి చెందిన దేవగిరి అంజయ్య, భవానిల కుమార్తె పల్లవి అవంతిపురం కస్తూరిబా పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. వేసవి సెలవుల్లో ఇంటి వద్దనే ఉంటున్న పల్లవి ఆదివారం కిరాణం షాప్ వద్దకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. బందువులని విచారించిన తల్లి భవాని రెండు రోజులైనా కూతురు ఇంటికి రాక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మయ్య పేర్కొన్నారు

## కొరటికల్ రైతు వేదిక నందు రైతు వారోత్సవం

**మునుగోడు, మే4, ప్రభాతవార్త:**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం రోజున కొరటికల్ రైతు వేదిక నందు రైతు వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సరస్వతి పద్మజ పాల్గొని మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, వినియోగదారులు కోరుకునే సన్నవరి రకాల సాగు పై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానవన శాఖ అధికారి విద్యాసాగర్ ఆయిల్ పామ్, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ సలహాలు సూచనలు అందజేశారు. కొరటికల్ గ్రామ సర్పంచ్ అద్దంకి రామలింగయ్య మాట్లాడుతూ రైతులందరూ వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు ఖర్చులు తగ్గించుకొని పంటలు సాగు చేస్తూ లాభాలు పొందాలని తెలియజేశారు. అనంతరం సాయి హెల్త్ కార్డులను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి విద్యాసాగర్, కొరటికల్ గ్రామ సర్పంచ్ అద్దంకి రామలింగయ్య, ఉప సర్పంచ్ మందుల అంజయ్య, దుబ్బకాల్వ ఉపసర్పంచ్ కంబాలపల్లి శంకర్, వార్డు మెంబర్స్ దండు లింగస్వామి, బొల్లం యాదయ్య, మాదిరెడ్డి దేవకమ్మ, కొండ వెంకన్న, వ్యవసాయ విస్తరణ అధికారి తేలుకుంట్ల వెంకటేష్, కొరటికల్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సాయిల్ హెల్త్ వాలంటీర్స్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

...ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

...బిఆర్ఎస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి



**మునుగోడు, మే4, ప్రభాతవార్త:** మునుగోడు మండలం పలివెల గ్రామంలో ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని బిఆర్ఎస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడూ కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు వడ్లు తెచ్చి రోజులు గడుస్తున్నా కాంటా పెట్టక పోవడం దారుణమన్నారు. తరుగు పేరుతో దోపిడీ ఆపాలని, నిబంధనల ప్రకారం 40.7కేజీలు ఉండాల్సిన బస్తాకు, ఏకంగా 42 కేజీలు తూకం వేస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. ఆకాశం మేఘావృతమై వర్షం ముప్పు పొంచి ఉన్నందున, రైతుల ధాన్యం తడవకముందే తక్షణమే కొనుగోలు పూర్తి చేయాలని అన్నారు. రైతు పక్షపాతిగా బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. పభుత్వం వెంటనే స్పందించకుంటే రైతుల తరపున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారగోని అంజయ్య, మేకల శ్రీనివాస్‌రెడ్డి, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ మార్త మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గజ్జల బాల, వార్డు సభ్యులు నాతి స్వామి, నాతి రాములు, బత్తుల శేఖర్, గిరిజ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి మహోత్సవం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం

పాల్గొన్న...బిఆర్ఎస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి

**మునుగోడు, మే4, ప్రభాతవార్త:**

మునుగోడు మండలం కిష్టాపురం గ్రామంలో సోమవారం జరిగిన బొడ్రాయి మహోత్సవం, శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు పాల్వాయి స్రవంతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంఓ గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## నేల ఆరోగ్య పరిరక్షణ, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

**మర్రిగూడ, మే4, ప్రభాతవార్త:**





ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికి 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, సోమవారం మర్రిగూడ, ఎర్రగండ్లపల్లి, లెంకలపల్లి, తమ్మడపల్లి రైతు వేదిక నందు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష, కార్డుల పంపిణీ, మట్టి నమూనా సేకరించే విధానం, సమగ్ర ఎరువుల యాజమాన్యం, వానాకాలం సాగు చేయాల్సిన వరి రకాల గురించి రైతులకు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, సూపరిడెంట్ యాకుబ్, ఏఈఓలు విజయ్, అరుణ, శ్రీలత, జయంతి, ఆయిల్ పంప్ ఇంచార్జ్ యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

## కట్టంగూర్ లో బిజెపి నేతల సంబరాలు



**కట్టంగూర్, మే 4, ప్రభాతవార్త,** భారతీయ జనతాపార్టీ మూడు రాష్ట్రాలలో విజయం సాధించడం తో బీజేపీ కట్టంగూర్ మండల పార్టీ ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు టపాకాయలు, పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ మండల వెంకన్న, బిజెపి జిల్లా కార్యదర్శి పబ్బు వెంకటేశ్వర్లు గౌడ్, కట్టంగూర్ మండల అధ్యక్షులు నీలం నాగరాజు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఐతగోని శివ, మండల బీజేపీ మాజీ అధ్యక్షులు నూకల సుధాకర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కోమటి భాస్కర్, కోమటి నర్సిహ్మా, ఒరుగంటి హరిబాబు, పాదూరి వెంకట్ రెడ్డి, పూలకరం శంకర్, బీజేవైఎం మండల అధ్యక్షులు బత్తిని నాగరాజు, బీజేవైఎం మండల కార్యదర్శి సుంకరబోయిన నవీన్, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇండ్లతో పేద ప్రజల కోరిక నెరవేరింది

....మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు



**చండూరు, మే4, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లతో పేద ప్రజల కోరిక నెరవేరిందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. సోమవారం 2వ వార్డులో గల చెనగాని రమేష్ అనురాధ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, మున్సిపల్ కౌన్సిలర్లు బుషిపాక వాసు, కోడి సుష్మ వెంకన్న, కటికం రమేష్, కోఆప్షన్ సభ్యులు కలట చంద్రకళ మారయ్య, షేక్ ఖలీల్, మోగుదల సత్తమ్మ వెంకన్న, వార్డ్ ఆఫీసర్లు గంట శ్రీరాములు, జగన్, బి.సాయిరాం, బిల్ కలెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గట్టుప్పల్లో డబుల్ రోడ్డు మంజూరు చెయ్యాలి

.....మాజీ జడ్పీటిసి కర్నాటి వెంకటేశం



**మర్రిగూడ గట్టుప్పల, మే4, ప్రభాతవార్త:** గట్టుప్పల మండల కేంద్రంలో డబుల్ రోడ్డు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని మాజీ జడ్పీటిసి కర్నాటి వెంకటేశం డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో డబుల్ రోడ్డు కొరకు గతంలో ఆర్అండ్ బి అధికారులు సర్వే నిర్వహించారని తెలిపారు. ఇట్టి డబుల్ సిసి రోడ్డు మంజూరు కొరకు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఇట్టి రోడ్డు మంజూరు కొరకు సంబంధిత జిల్లా ఆర్అండ్ బి అధికారులకు 8 కోట్లతో ప్రతిపాదనలు ఆర్అండ్ బి ఈఎన్సీకి పంపితే నేటి వరకు మంజూరు కాలేదని ఆరోపించారు. గ్రామంలో ఇరుకు రోడ్లతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, రెండు బస్సులు ఎదురెదురుగా వస్తే వెళ్ళలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వెంటనే ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఆర్అండ్ బి ఈఎన్సీ వద్ద పెండింగ్‌లో ఉన్న ఇట్టి డబుల్‌రోడ్డు ప్రతిపాదనలను మంజూరు చేయించి నిర్మాణం చేపట్టాలని అన్నారు.

## ఎక్కువమంది ఉపాధి పనికి హాజరయ్యేలా ప్రోత్సహించాలి

**తుర్కపల్లి, మే 4 ప్రభాతవార్త**

గ్రామాల్లో ఎండాకాలంలో వ్యవసాయ పనులు లేని సందర్భంలో ఎక్కువ మంది ఉపాధి పనికి హాజరయ్యేలా ప్రోత్సహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సర్పంచులకు, కార్యదర్శులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి అవసరమైన పనులు గుర్తించి తీర్మానాలు పంపించాలని సూచించారు. పనిచేయడానికి 40 మందికి ఒక మేట్ ను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ఎండాకాలం చెట్లకు నీరు అందించాలని అన్నారు .పని ప్రదేశంలో కూలీలకు వసతులను ఏర్పాటు చేయాలని టెంట్లు, నీళ్లు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్ అందజేయాలన్నారు. యాక్టివ్ జాబ్ కార్డు గల కూలీలకు 100 శాతం ఈ కేవైసీ చేయాలని ఇందిరమ్మ గృహాలకు టాయిలెట్స్ నిర్మాణం 12 వేల రూపాయలు, ఇందిరమ్మ ఇండ్లకు 26,700 విలువగల 90 పని దినాలకు ఉపాధి హామీ ద్వారా వేతనం చెల్లించాలని, నర్సరీలు విత్తనాల మొలకెత్తడం ,కాళీ బ్యాగుల్లో వేరే చెట్లను నాటడం ,వనమహోత్సవ కార్యక్రమానికి పని ప్రదేశాలు గుర్తించి తీర్మానం చేయాలని, సిఎస్సి కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణము, ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణం ,ఊరు చివర మురుగునీరు నిల్వ చేసే పెద్ద సోక్ ఫీట్ నిర్మాణము, కమ్యూనిటీ సోక్ ఫీట్ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి ,ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, ఏపిఓ ఎర్ర నారాయణ, ఈసీ యశోద, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు



# నకిలీ విత్తనాలు, ఎరువుల దుర్వినియోగం అరికట్టేందుకు కమిటీలు

## జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రావణ్ కుమార్

**చిట్యాల రూరల్, మే 4, ప్రభాతవార్త** :నకిలీ విత్తనాలు, ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు గ్రామస్థాయిలో నిఘా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రావణ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం చిట్యాల మండలం లోని చిన్నకాపర్తి గ్రామంలో నిర్వహించిన రైతు వారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలోని రైతువేదిక సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే సీజన్ నుండి నకిలీ విత్తనాలు, ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు నిఘా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీల్లో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ముగ్గురు అభ్యుదయ రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి సభ్యులుగా ఉంటారని చెప్పారు. రైతుల అవసరాలు, సమస్యలను సంబంధిత అధికారులకు చేరవేసే బాధ్యత వీరిపై ఉంటుందని వివరించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినా, ఎరువులను అధికంగా వినియోగించినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సీజన్ నుండి ప్రతి రైతు పొలంలో మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించి రిపోర్టులు అందజేస్తామని తెలిపారు. రైతులు ఆ రిపోర్టుల ఆధారంగానే ఎరువులను



వినియోగించాలని సూచించారు. అలాగే వరి పంటపై ఆధారపడటం తగ్గించి ఇతర పంటలపై దృష్టి సారించాలని, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంతో భూమి సారాన్ని పెంచుకోవాలని సూచించారు. మండలంలోని రైతులందరికీ పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిన్నకాపర్తి సర్పంచ్ ఆవుల సుందరయ్య యాదవ్, ఇఫ్కో ఎరువుల ప్రతినిధి వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి వాసుదేవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.




## నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

**చిట్యాల, మే 4, ప్రభాతవార్త**

కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులను నేడు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం లబ్ధిదారులకు అందచేయనున్నారని తాసిల్దార్, చిట్యాల మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీతా రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చిన్నమల్లయ్య యాదవ్, నాయకులు వనమా వెంకటేశ్వర్లు వేరువేరు ప్రకటనల ద్వారా తెలిపారు. భువనగిరి రోడ్డులో గల లక్ష్మీ గార్డెన్స్ లో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో చెక్కులను పంపిణీ చేస్తారని ఆయన వివరించారు.

# రైతు వారోత్సవాలకు శ్రీకారం

## త్వరలో భూసార పరీక్షలు,

## సాయిల్ హెల్త్ కార్డు పంపిణీ



**నార్కెట్పల్లి, ప్రభాతవార్త మే 04** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఉత్సవాల సందర్భంగా నార్కెట్పల్లి మండలంలో రైతు వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నార్కెట్పల్లి, ఎల్లారెడ్డి గూడ, నెమ్మాని, అక్కనపల్లి మరియు అమ్మనబోలు గ్రామాల రైతు వేదికలలో తొలి రోజు సమావేశాలు వ్యవసాయ అధికారులు నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల క్లస్టర్ హెడ్ క్వార్టర్స్ నార్కెట్పల్లిలో మండల వ్యవసాయ అధికారి గౌతమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించిన సన్న మరియు దొడ్డ వంట రకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించి, ఏప్రిల్ నెలలో రైతుల భూముల నుండి సేకరించిన నమూనాల ఆధారంగా సిద్ధం చేసిన సాయిల్ హెల్త్ కార్డ్స్ ను పంపిణీ చేశారు.ఇక నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలపై కూడా అధికారులు రైతులకు వివరణ ఇచ్చారు. రైతు వారోత్సవాల గోడపత్రికలలో అధికారులు రైతులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాలలో వివిధ గ్రామాల సర్పంచులు, వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

**నార్కట్ పల్లి, ప్రభాతవార్త మే 04**

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరు చేయబడిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను నార్కట్ పల్లి మండల కేంద్రంలో నేడు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు నకిరేకల్ నియోజకవర్గ శాసన సభ్యులు వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరై 57 మంది లబ్ధిదారులకు ఉదయం 10 గంటలకు నార్కట్ పల్లి లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఫంక్షన్ హాల్ లో చెక్కులను అందజేయనున్నారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు మండల తహసిల్దార్ ఎల్ వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

## డిగ్రీ ఇయర్ వైస్ బ్యాక్ లాగ్ ఫలితాల విడుదల.

**నార్కట్పల్లి ప్రభాతవార్త మే 04**

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ ఇయర్ వైస్ బ్యాక్ లాగ్ విద్యార్థులకు మార్చి,ఏప్రిల్ నెలలో నిర్వహించిన పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేశారు. మొదటి సంవత్సరంలో 80.5 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, రెండవ సంవత్సరంలో 77 , మూడవ సంవత్సరంలో 69 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు సిఒఈ డా.జి.ఉపేందర్ రెడ్డి తెలిపారు.ఫలితాల పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్ సైట్ లో పొందుపరిచినట్లు ఆయన తెలిపారు.

## బాలసాహితీమిత్ర పురస్కారం అందుకున్న ఉపాధ్యాయులు

**చిట్యాల రూరల్, మే 4, ప్రభాతవార్త :**

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తూ వారి చేత రచనలు చేయించి పుస్తకాలు వెలువరించిన ఉపాధ్యాయులు పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ పొట్ట బత్తుల రామకృష్ణలకు తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక బాల సాహితీ మిత్ర పురస్కారంను సంయుక్తంగా ప్రదానం చేశారు..హైదరాబాద్‌లోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సోమవారం నిర్వహించిన కోదూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సమ్మేళనంలో ఈ పురస్కారాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.వి. రమణాచారి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎల్లూరి శివారెడ్డి, కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్, ప్రముఖ బాలసాహితీవేత్త గరిపెల్లి



అశోక్‌ల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలను చిట్యాల మండలానికి చెందిన సాహితీవేత్తలు కుకుడాల గోవర్ధన్, పగిడిపాటి నరసింహ, సిలివేరు నరసింహ, డాక్టర్ సాగర్ల సత్తయ్య తదితరులు అభినందించారు.

# ఘనంగా రైతు వారోత్సవాలు

**డిండి, మే 4, ప్రభాతవార్త,**



డిండి మండలంలోని డిండి రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యక్రమం)" లో భాగంగా రైతు వారోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిం చారు. ముఖ్యంగా నేల ఆరోగ్య పరిరక్షణ సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం పద్ధతులు, నాణ్యమైన విత్తనాల వినియోగం విషయాలపై శాస్త్రీయ విధానాల్లో వివరించారు. ఈ సందర్భంగా రైతులు అధిక దిగుబడులు సాధించడానికి సరైన ఎరువుల వినియోగం, నేల పరీక్షల ప్రాముఖ్యత, ఆధునిక సాగు పద్ధతులపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేస్కున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు భూసార ఆరోగ్య కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిండి సర్పంచ్ నల్లగంతుల రవి, మండల ఏఓ రెహానా, ఏఈవో వెంకటేష్, పిఏసిఎస్ సీఈవో బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి ఎం ఈ ఓ

**నార్కట్పల్లి ప్రభాతవార్త మే 04** ప్రతిభకు ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని కష్టపడి చదివే తత్వంతో భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నార్కట్పల్లి మండల విద్యాధికారి కూకట్ల నరసింహ అన్నారు. మండలంలోని బ్రాహ్మణవెల్లెంల పాఠశాలలో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి వార్షిక ఫలితాలలో 100 ఉత్తీర్ణత సాధించడం జరిగింది. 600 మార్కులకు 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూకుట్ల నరసింహ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ ధర్మయ్య , ఎపీసీ చైర్మన్ ఎం.అనిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## సర్పంచ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన విప్, ఎమ్మెల్యే వీరేశం

**కట్టంగూర్, మే 4, ప్రభాతవార్త,**



మండలంలోని మునుకుంట్ల గ్రామ సర్పంచ్ గుల్లి నరేష్ కు ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ తో కేక్ కట్ చేయించి తినిపించారు. ఈ కార్యక్రమంలో పన్నాల రాఘవరెడ్డి, ఒంటెపాక ఏసుపాదం, అయితగోనీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మొదటి ప్రజావాణి కార్యక్రమం విజయవంతం.

**నియోజకవర్గ ప్రజలకు అత్యంత సమీపంలో ప్రజావాణి సేవలు.**

**30 రోజుల్లో సమస్యల పరిష్కారం : ఆర్డీవో రమణారెడ్డి.**





**దేవరకొండ, మే 04, ప్రభాత వార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి డివిజన్ కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుండి ప్రారంభించినట్లు దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లా దేవరకొండ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారని ఇచ్చిన దరఖాస్తులను ప్రజావాణి సైట్ లో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుల సమస్యల పరిష్కారం 30 రోజుల్లో పరిష్కరించే దిశగా పనిచేస్తామని అన్నారు. ప్రతి ఒక్క దరఖాస్తుకు ఐడి ఇస్తామని దరఖాస్తుదారుడు ఐడి ద్వారా తమ దరఖాస్తు ఏ స్థాయిలో పెండింగ్ ఉన్నదో తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని డివిజన్ స్థాయిలోని వివిధ శాఖల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు అందించి పరిష్కార మార్గం పొందాలని తెలిపారు. మొదటి సమావేశంలో మొత్తం దరఖాస్తులు 25 వచ్చాయని అందులో 17 దరఖాస్తులు రెవిన్యూకు సంబంధించినవి, ఐదు దరఖాస్తులు పంచాయతీరాజ్ శాఖకు సంబంధించినవి, మిగిలినవి ఎలక్ట్రిసిటీ శాఖకు సంబంధించినవని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క దరఖాస్తుని సంబంధిత శాఖలకు ప్రజావాణి ఆన్లైన్ ద్వారా పంపించి సత్వరముగా పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ స్థాయి ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని అయన తెలిపారు.

## సేంద్రియ వ్యవసాయం, ఎరువులు వాడకంపై రైతులకు అవగాహన సదస్సు

**పెద్ద అడిశర్లపల్లి, 04మే ప్రభాతవార్త:**



తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వ్యవసాయ నిపుణులు ఎరువుల వాడకం,సేంద్రియ వ్యవసాయం పై రైతులకు అవగాహన సదస్సు ను సోమవారం నాడు రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతు వేదిక అంగడిపేటలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆర్.సుశీల, ప్రధాన శాస్త్రవేత్త, మొక్కజొన్న పరిశోధనా స్థానం, రాజేంద్ర నగర్, డా. బి.లక్ష్మీ ప్రసన్న, శాస్త్రవేత్త, వరి పరిశోధనా విభాగం, రాజేంద్ర నగర్, ఈ కార్యక్రమని ముఖ్య ఉద్దేశ్యం అవగాహన అంశాల గురించి వివరించారు.తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించుకోవడం గురించి, నేలతల్లి ఆరోగ్యం కాపాడడం గురించి, అవసరం మేరకే రసాయనాలు వినియోగించడం పై పంట మార్పిడి పాటించి, సుస్థిర ఆదాయాన్ని పొందడంపై రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్లో గిరాకీ ఉన్న పంట రకాల వివరాలను తెలియ చేయడంతో పాటు, సాగు నీటిని ఆదా చేసి భావితరాలకు అందించడం పై సేంద్రీయ పద్ధతులను పాటించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఆస్వాదించడం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ శ్రీలక్ష్మి, వ్యవసాయాధికారి రావుల పాండు మాట్లాడుతూ రైతులందరూ శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక ఆదాయం పొందాలని పిలుపునిచ్చారు. సిఫారసు మేరకే యూరియాను వాడుకొని మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామవత్ చిరంజీవి ఆధ్వర్యం లో రైతులకు నేల ఆరోగ్య పరీక్ష పత్రాలు పంచడం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ అవసరం మేరకే యూరియా వాడాలని సూచించారు. సమగ్ర ఎరువుల యాజమాన్య పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో విస్తరణాధికారి వి . జ్యోతి,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని వారి సందేహాలను నివృతి చేసుకున్నారు.

## తొమ్మిది రోజులుగా మంచి నీళ్ల కోసం ఎదురుచూపు

**ఇంకెన్నాళ్లు మాకీ నిరీక్షణ....**

**తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నివాసులు.**





**దేవరకొండ, మే 04, ప్రభాత వార్త :** దేవరకొండ పట్టణ శివారులోని డబుల్ బెడ్‌రూమ్ నివాసాల్లో తాగునీటి సమస్య జటిలమైంది. గత 9 రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మిషన్ భగీరథ నీరు కూడా రాకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలోని గీ, గి, జూ, జు, ళీ, ళి బ్లాకులలో నీటి సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. గత తొమ్మిది రోజులుగా చుక్క నీరు రాకపోవడంతో దైనందిన అవసరాలకు కూడా ప్రజలు అల్లాడిపోతున్నారు. మంచినీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని నివాసితులు పేర్కొంటున్నారు. ఈ సమస్యపై విసిగిపోయిన స్థానిక నివాసితులు సోమవారం నాడు మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సుల్తానా బేగం, ఎస్.కె. సెహ్రీన్, లక్ష్మి, ఇతర నివాసితులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తక్షణమే నీటి సరఫరాను పునరుద్ధరించాలని, తమ ఇబ్బందులను తొలగించాలని వారు కోరుతున్నారు.




## పీఏసీఎస్ చైర్మన్‌గా ఆలకుంట్ల నాగరత్నం రాజు

**ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నల్లగొండ గొల్లగూడ పిఏసిఎస్ చైర్మన్ గా బాధ్యతల స్వీకరమంత్రి కోమటిరెడ్డి సహకారంతో రైతుల సంక్షేమానికి కృషి**



**నల్గొండ రూరల్ మే04, ప్రభాత వార్త:** నల్లగొండ గొల్లగూడ పిఏసిఎస్ చైర్మన్ గా ఆలకుంట్ల నాగరత్నం రాజు ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొల్లగూడ పీఏసీఎస్ నుండి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తూ రైతులకు సకాలంలో ఋణాలు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు సేవ చేయడం ఎంతో అదృష్టం అని వారికి ఎలాంటి కష్టాలు ఎదురు కాకుండా రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తూ సొసైటీని మొదటి స్థానంలో ఉంచడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు సిబ్బంది మరియు అభిమానులు చైర్మన్ ను పూల మాలలు, బోకే,శాలువాతో అభినందిస్తూ సన్మానించారు.

## మోడల్ స్కూల్లో " అద్భుత ప్రతిభ " కనబరిచిన టెన్త్ క్లాస్ విద్యార్థిని.

**దేవరకొండ, మే 04, ప్రభాత వార్త :**



దేవరకొండ మండలం పెంచికల్ పహాడ్ తెలంగాణ మోడల్ స్కూల్ లో 10వ తరగతి విద్యార్థిని 541 మార్కులు సాధించి అద్భుత ప్రతిభ కనబరిచి స్కూల్ టాపర్‌గా నిలిచిన జల్లా శ్రావ్యకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసిన ఉపాధ్యాయులు.ఈ గొప్ప విజయాన్ని పురస్కరించుకొని పాఠశాల సిబ్బంది అందరు కలిసి విద్యార్థిని తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా సన్మానించి, శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేయడం ఎంతో గర్వకారణం. ఈ విజయం ఆమె కృషి, పట్టుదల, గురువుల మార్గదర్శకత్వం అదేవిధంగా తల్లిదండ్రుల ప్రోత్సాహానికి ప్రతిఫలం. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించి జల్లా శ్రావ్య మరింత ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, కుటుంబానికి మరింత కీర్తి తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## పేదింటి బిడ్డకు...డాక్టర్ పట్ట



**పెద్ద అడిశర్లపల్లి,04 మే ప్రభాతవార్త:** అత్యంత పేదరికంలో పుట్టిపెరిగి ఎంబిబిఎస్ పూర్తిచేసి డాక్టర్ కోర్సు పట్టా అందుకున్నారు. పీఏపల్లి మండల కేంద్రా నికి చెందిన మండల కేంద్రంలోని ఎర్ర యాదగిరి నర్సమ్మల కుమార్తె పూజిత మొదటి నుండి చదువులో ముందంజలో ఉండి తండ్రి మరణించిన డాక్టర్ కావాలని ఆశయంతో ప్రభుత్వ కోటాలో సీటు సాధించి ఉస్మానియాలో డాక్టర్ కోర్సు పూర్తి చేసింది. పదవ తరగతి లో968 మార్కులు సాధించి 9.5జి పీ ఏ రాగ, ఇంటర్ గురుకులాల చదివి నీట్ లో ఆల్ ఇండియా లో 61వేల ర్యాంక్, స్టేట్ లో1514 ర్యాంకుతో ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు పొందింది. శనివారం రాత్రి ఎంబీబీఎస్ పూర్తి అయిన సందర్భంగా ఉస్మానియాలో డాక్టర్ పట్టా పొందింది. మారుమూల గ్రామానికి చెంది అత్యంత పేదరికంలో ఉన్న పూజిత డాక్టర్ పట్టా పొందడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పదిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఘన సన్మానం

**నకిరేకల్, మే 4, ప్రభాతవార్త :**

నకిరేకల్ మున్సిపాలిటీలోని నాలుగో వార్డుకు చెందిన పలువురు విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నేపథ్యంలో సంతోష్ నగర్ మన ఫ్రెండ్స్ కమిటీ ఆధ్వర్యంలో ఓ వేడుకల మందిరంలో విద్యార్థుల అభినందన సన్మాన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు, కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కమిటీ సభ్యులతో కలిసి విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. మెమోంటో, భారత రాజ్యాంగ పుస్తకాలను బహుకరించి అభి నందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని పెట్టుకుని కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. రాజ్యాంగ విలువలను అర్థం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**బీబీనగర్, మే 4 ప్రభాతవార్త:**
భూమిలోని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నేటికీ హామీని అమలు చేయలేదని వ్యవసాయ కార్మిక సంఘం మండల మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పోరాటల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. పాత పద్ధతిలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, ఉపాధి హామీ పని ప్రదేశంలో కనీసం సౌకర్యాలు కల్పించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 800 రూపాయలు కూలి ఇవ్వాలని,



200 రోజుల పని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శ్రీరాములు, మండల అధ్యక్షులు కొలిచెల్మే ప్రసన్న, ఆండాలు, సత్తమ్మ,బాలమణి, కేతమ్మ, సుగుణమ్మ, గణేష్ పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోళ్లు చేయాలని రోడ్డుపై రైతుల రాస్తారోకో

**రామన్నపేట, మే4 ప్రభాతవార్త**
మార్కెట్లలో ధాన్యం పోసి నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోళ్లు చేపటట్లేదని మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై సోమవారం పెద్ద ఎత్తున రైతులు రాస్తారోకో నిర్వహించారు. రైతులు ధర్నా చేస్తున్న క్రమంలో పోలీసులకు రైతులకు వాగ్వాదం చోటుచేసుకోగా కొనుగోళ్ల విషయంలో అధికారుల నుండి సరైన భరోసా ఇవ్వకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మార్కెట్లలో ధాన్యం పోసి నెల రోజులు గడుస్తున్నా కొనకపోవడంతో వర్షాలతో ధాన్యం తడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, హమాలి వారిని, లారీలను పెద్ద మొత్తంలో అందుబాటులో ఉంచాలని, రైస్ మిల్లుల దోపిడిని అరికట్టాలని, క్వింటాలుకు ఐదారు కేజీలు కట్ చేస్తున్న రైస్ మిల్లులను సీజ్ చేయాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు.కాంట వేసిన24 గంటల్లో రైతులకు డబ్బులు వేయాలని, అవినీతికి పాల్పడుతున్న అధికారులను తీసివేయాలని, ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెప్పి రైతులను అరిగోసలు పెడుతుందని అధికారంలోకి రాగానే రైతు డిక్లరేషన్ ఇంప్లిమెంట్ చేస్తామని చెప్పి ప్రస్తుతం దాని ఊసే లేదని ఆరోపించారు.రైతు బంధు కు మంగళం పలికి రైతు కూలీల మాటే



లేదని రైతును రాజును చేస్తామని చెప్పి రైతులపైనే రాజకీయం చేస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు చేయాలని,ఎలాంటి కటింగ్ లు లేకుండా చూడాలనారు. 24 గంటల్లో రైతుల అకౌంట్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీ.సీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, పిట్ట కృష్ణారెడ్డి ముద్రబోయిన శ్రీశైలం, గుండాల మల్లేష్, భూర్ర సైదులు, కొమ్మనబోయిన ఆదినారాయణ, పిట్ట చలపతి రెడ్డి, నడిగోటి మారయ్య, తరాల నరసింహ, పెట్టా నరసింహారెడ్డి, సాగర్ల శ్రీశైలం, కన్నబోయిన శేఖర్, చింతకాయల నరేష్, నరేందర్ రెడ్డి, వేముల లింగస్వామి, వేముల వెంకన్న, గుండు రమేష్, కన్నెబోయిన వెంకన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు

## రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**రామన్నపేట, మే 4 ప్రభాతవార్త**
మండలంలోని అన్ని గ్రామాల రైతుల సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. గ్రామాలలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతూ స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ మార్కెట్ యార్డులో రైతులు వరి ధాన్యం నెల రోజుల నుండి కుప్పలు కుప్పలుగా పేరుకపై ఉన్నప్పటికీ మార్కెట్లో ఉన్న ప్రభుత్వ యంత్రాంగం కొనుగోళ్ల వేగవంతం చేయకుండా జాప్యం చేస్తూ మిల్లర్ల దగ్గర నుండి లారీ వెళ్ళినాక మీ ధాన్యంలో తరుగు ఉందని, క్వింటాల్కు 5 కేజీల చొప్పున కట్ చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే కొనుగోళ్ళు వేగవంతం చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోమార్కెట్ కమిటీ వైస్ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ బందెల రాములు, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి ,సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్, గొలుసుల సత్తయ్య ,పులిపలుపుల వీరస్వామి, మాజీ ఎంపీటీసీలు పున్న వెంకటేశం ఎండి ఆమీర్ ,జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం ,బద్దుల రమేష్ ,ఎస్కే చాంద్, మందడి సాగర్ రెడ్డి, మాజీ సర్పంచులు రేఖ యాదయ్య, పిట్టె కృష్ణారెడ్డి ,నాయకులు మెట్టు శ్రీనివాసరెడ్డి, బత్తుల వెంకన్న, కూనూరు ముత్తయ్య, బండ శ్రీనివాసరెడ్డి, గంగుల రాఘవరెడ్డి, బొల్లం సతీష్, బుర్ర శ్రీశైలం, నక్క నరేందర్, జెట్టి శివప్రసాద్, ముక్కామల నరేందర్, కోళ్ల కిషన్, నల్ల సైదులు, చిన్నపాక శ్రీనివాస్, ముక్కామల సత్తయ్య, గుండు రమేష్ ,బత్తిని మహేష్, మద్యపురి పద్మయ్య ,బొడ్డుపల్లి రాజు, కన్నెబోయిన వెంకటేశం, రాస వెంకటేశ్వర్లు ,కంచి నరసింహ, బొలుగుల కృష్ణ, ఆవుల శ్రీధర్, జాల అమరేందర్ రెడ్డి, కూనూరు లింగస్వామి, వంగాల యాదయ్య, వర్కల రమేష్, సింగం రోశయ్య, చొప్పరి లింగయ్య ,మందడి నర్సిరెడ్డి ,చలమల్ల బిక్షం రెడ్డి, వంగాల సాయి, గంగాదేవి జంగయ్య ,గుండాల మల్లేశం, వర్కల మల్లేశం, తాడూరి జంగయ్య, ముక్కామల శ్రీను రైతులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలి

**గుండాల, మే 5 ప్రభాతవార్త:**
గ్రామ అభివృద్ధిలో పార్టీల తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని స్థానిక సర్పంచ్ గూడపు కుమార్ అన్నారు సోమవారం అయిన గుండాల మండలం మరిపెడ గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన మహిళా సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదిగేందుకు ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ లో పెద్దపీట వెస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ దామోదర్ ,మాజీ ఎంపీటీసీ సింగారం సునీత, ఉపసర్పంచ్ చొప్పరి సోమన్న, వార్డు సభ్యులు వై.అండాలు, పానుగంటి గణేష్, ఇందిరాల ఉపేంద్ర ,బూడిద రోజా ,మహిళా సంఘం అధ్యక్షురాలు సింగారం లక్ష్మి ,ఉపాధ్యక్షురాలు గోల్కొండ లక్ష్మి మాజీ ఉపసర్పంచ్ తోటకూరి శ్రీనివాస్, నాయకులు అనంతుల శేఖర్, బోయిని ఐలయ్య ,అనంతుల అంజయ్య, ఇందిరాల ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు



## భువనగిరి వార్త

### ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవం



**బీబీనగర్, మే 4 ప్రభాతవార్త**
:ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవం కార్యక్రమాన్ని మండల పరిధిలోని పడమటి సోమవారం గ్రామంలో గల రైతు వేదికలో సోమవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పద్మ మాట్లాడుతూ భూసార పరీక్షలు దాని ఉపయోగాలు, నానో యూరియా ఉపయోగించే విధానం, వరిలో మేలైన విత్తన రకాల ఎంపిక వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ, నేలను కాపాడుతామని ప్రతి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులకు పాల్గొన్నారు

### పరిపాలన అధికారులని నియమించాలి

**కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన జాలిగం**

**భువనగిరి రూరల్ మే 4 ప్రభాతవార్త**



పరిపాలన అధికారులను అదనంగా నియమించాలని వార్డు కౌన్సిలర్ జాలిగం విగ్నేష్ సోమవారం జిల్లా కలెక్టర్ వెంకా రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి మున్సిపల్ పరిధిలో జనాభా ప్రాతిపదికన నలుగురు పరిపాలన అధికారులు ఉండాల్సి ఉండగా ఒకరు మాత్రమే ఉండడంతో ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ఏర్పడుతుందని, నూతన విద్యా సంవత్సరం మొదలవుతున్న సందర్భంగా ఇన్కమ్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, రేసిద్ సర్టిఫికెట్ల నిమిత్తం విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలు వార్డులలో సమస్యలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట ప్రజా సంఘాల నాయకులు కుతాడి సురేష్ తదితరులు పాల్గొన్నారు

### భువనగిరి మున్సిపల్ కమిషనర్ గా కె చంద్రప్రకాశ్ రెడ్డి

**భువనగిరి రూరల్ మే 4 ప్రభాతవార్త**




భువనగిరి మున్సిపల్ నూతన కమిషనర్ గా కే చంద్రప్రకాష్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు సిబ్బందితో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పట్టణంలోని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు.

# పచ్చని చెట్లు అగ్గిపాలు

**మాడుగులపల్లి, మే 04 ప్రభాతవార్త**

ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా తీసుకొని,మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద పచ్చని చెట్లని పెంచాలని, ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడే క్రమంలో, మొక్కలను పెంచాలనే దృఢ నిశ్చయంతో ప్రభుత్వాలు, అధికారులు పనిచేస్తుంటే, అశ్రద్ధతో, నిర్లక్ష్యంగా,మండలంలోని కుక్కడం సమీపంలోని, వాసవి సాల్వెంట్ ఇండస్ట్రీ యాజమాన్యం,హరిత హారం చెట్లను అగ్గిపాలు చేస్తున్నా, అధికారులు తమకేమి పట్టనట్లు, అటువైపు చూడక పోవడం విడ్డురమని, ఇకనైనా



సంబంధిత అధికారులు, చెట్లను అగ్గిపాలు చేసిన ఇండస్ట్రీ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

# స్వచ్ఛంద సేవా సంస్థకు ఉపాధ్యాయుడి వితరణ

**మునగాల,మే 4, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల జగన్నాథపురం ఉపాధ్యాయుడు వక్కంతుల భరత్ బాబు తను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం కోదాడలోని శనగల రాధాకృష్ణ స్వచ్ఛంద సేవా సంస్థ అనాధ ,మానసిక వికలాంగుల పిల్లలు సేవా సంస్థకు 5000 రూపాయలు విరాళంగా అందించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ మతములో భగవద్గీత ప్రకారం దీనిని కర్మయోగమని పిలుస్తారని అన్నారు. హృదయ శుద్ధికి, మోక్షానికి మార్గంగా ఉంటుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ మానవత



దృక్పథం కలిగి ఉండాలన్నారు.ఆ ఈశ్వరుడి కృపకులోను కావాలని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సంస్థ వార్డెన్ జే. నర్మద, సిబ్బంది అనాధ పిల్లలు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సానికి నేలకూలిన ఇండ్లు

**అనంతగిరి మే 04 ప్రభాత వార్త**

మండలంలోని గోండ్రియాల గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షం భీకర పరిణామాలను మిగిల్చింది.ఈ వర్షంతో గ్రామానికి చెందిన చిర్ర మాధవరావు,బట్ట యలమంచిలి ఇల్లులు పూర్తిగా కూలిపోయాయి.ఈ ఘటనతో కుటుంబాలు నిరాశ్రయమై,తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది.వర్షం ధాటికి కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు షాక్‌లో మునిగిపోయారు.బాధిత కుటుంబాల తమ దీనస్థితిని వివరిస్తూ తాము నిరుపేదలమని,ఈ విపత్తు తమను మరింత కష్టాల్లోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇండ్లు కూలిపోవడంతో వారి జీవనోపాధి,ఆశ్రయం అన్నీ కోల్పోయాయని,ఇప్పుడు రోడ్డున పడ్డామని కన్నీళ్లతో చెప్పుకొచ్చారు.ప్రభుత్వం తమకు తక్షణ సహాయం అందించాలని వారు కోరుతున్నారు.ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కొత్త ఇల్లు మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ అధికారులు ఈ ఘటనపై స్పందించి,బాధిత కుటుంబానికి సహాయం అందించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కుటుంబాలకు ఇల్లు మంజూరు చేయడంతో పాటు, ఇలాంటి విపత్తుల నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలను కాపాడేందుకు శాశ్వత పరిష్కారాలు చేపట్టాలని వారు సూచిస్తున్నారు



# ఘనంగాఎమ్మెల్యే బి ఎల్ఆర్ జన్మదిన వేడుకలు

**రూ 25 లక్షలు నగదు ప్రోత్సాహకం పంపిణీ.**

**. మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన**



**మిర్యాలగూడ, మే 4 ప్రభాతవార్త**

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) పుట్టినరోజు వేడుకలు సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, అన్నధికారులు నాయకులు, శ్రేణులు, కేకులు కాటు చేసి స్వీట్లు పంపిణీ చేసి శాలువాలతో సన్మానించి బొకేలు, పూల మొక్కలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా మెరిట్ విద్యార్థులు 66 మందికి బి ఎల్ ఆర్ భరోసా 25 లక్షల నగదు ప్రోత్సాహకం పంపిణీ చేశారు. తమ పిల్లల చదువుకు అండగా నిలిచిన ఎమ్మెల్యేకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ కాంప్లెక్ లో మహనీయుల



విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే బిఎల్ఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజానికి దిశా నిర్దేశం చేసిన గొప్ప వ్యక్తుల స్ఫూర్తి నేటి యువతకు అందాలని ఉద్దేశముతో ఈ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బి ఎల్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి తాపాన్ని తట్టుకునేలా ఏర్పాటు చేసిన ఉచిత పెరుగన్నం పంపిణీ చేశారు. అంతకు ముందు భారీ కేక్ కట్ చేసి స్వీట్లు ప్రజా ప్రతినిధులకు నాయకులకు శ్రేణులకు అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి జేఈఓ డాక్టర్ శరత్, డి.ఎస్.పి రాజశేఖర్ రాజు , మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ వయసు చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, కమిషనర్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి కౌన్సిలర్లు, కౌన్సిలర్లు దేశిడీ శ్రీలేఖశేఖర్ రెడ్డి, మలగం రమేష్, ఆడోత్ అశోక్ నాయక్, అవుట శ్రీనివాస్, 25 వార్డు ఇంచార్జ్ గోదాల జానకి రామ్ రెడ్డి, మండల విద్యాధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు నాయకులు అభిమానులు బిఎల్ఆర్ బ్రదర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మిర్యాలగూడ వార్త



# నేడు వాహనాల వేలం

**మిర్యాలగూడ, మే 4 ప్రభాతవార్త**

మిర్యాలగూడ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు కేసులలో జప్తు చేసిన 3 ద్విచక్ర వాహనములకు నేడు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ ఎక్సైజ్ స్టేషన్లో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే బహిరంగ వేలంలో ఆసక్తి ఉన్న వారు నేరుగా హాజరు కావాలని కోరారు.

# జల్సాల కోసం దొంగలుగా మారిన మైనర్ బాలురు

**ఇద్దరు అరెస్ట్ ఒకరు పరారి 7బైక్ లు స్వాధీనం**

**మిర్యాలగూడ, మే 4 ప్రభాతవార్త**



జల్సాలకుఅలవాటు పడిన ముగ్గురు మైనర్ బాలురు ముఠాగా ఏర్పడి బైక్ దొంగతనాలు వృత్తిగా మలచుకున్నారు. సోమవారం పట్టణంలోని విద్యా నగర్ కాలనీలో బైక్ పై వెళ్తున్న వారిని పోలీసులు ఆపి విచారించగా, దొంగతనాలకు సంబందించిన విషయం వెలుగులోకి వచ్చింది. మిరాౄలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు వెల్లడించిన వివరాల ప్రకారం.....పట్టణంలోని సుందర్ నగర్, ఈదులగూడ, హౌసింగ్ బోర్డు కాలనీలకు చెందిన ముగ్గురు పాఠశాల నుంచే స్నేహితులు. చిన్న నాటి నుంచే వ్యసనాలకు బానిసలుగా మారిన ముగ్గురు చిన్న చిన్న దొంగతనాలు చేసి వాటిని అమ్మి మద్యం సేవించే వారు. ఇలా వచ్చే డబ్బులు చాలక హుజూర్ నగర్, మిర్యాలగూడ, వాడపల్లి, దాచేపల్లిలో బైక్ లు దొంగిలించగా వీరి పై ఆయా పోలీసు స్టేషన్లలో 9 కేసులు నమోదు అయ్యాయి. కాగా సోమవారం విద్యానగర్ బైక్ దొంగిలించి వెళ్తున్న ముగ్గురిని పోలీసులు ఆపి విచారిస్తుండగా సుందర్ నగర్ కి చెందిన బాలుడు పరారవగా మిగిలిన ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 7 బైక్ లు స్వాధీనం చేసుకొని కోర్టు కు రిమాండ్ కి తరలించినట్లు తెలిపిన డీఎస్పీ, నిందితులని గతంలో జూవైనల్ హోం కి తరలించినప్పటికీ దొంగతనాలు మానలేదన్నారు. నిందితులను గుర్తించడంలో చాక చక్యంగా వ్యవహరించిన వన్ టౌన్ సీఐ నాగభూషణ రావు, ఎస్సై సైది రెడ్డి లతో పాటు సిబ్బంది ని డీ ఎస్పీ అభినందించారు.

# ఎన్విఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**మిర్యాలగూడ, మే 4 ప్రభాతవార్త**

ఎన్విఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్ అడోత్ అశోక్ నాయక్ లు కేక్ కోసి పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత బీ ఎల్ ఆర్ అని యువత వ్యసనాలకు అలవాటు పడకుండా క్రీడాసక్తి పెంపోందించడం సత్సంప్రదాయమని ఆ దిశగా మౌలిక వసతులు కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, స్కైలాబ్ నాయక్, కౌన్సిలర్లు సోమ సుందర్, సైదులు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్, కన్నెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, నాగు నాయక్, నాగరాజు, అశోక చారి, మనోహర్ రెడ్డి ,భీమేష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు



# నేడు రైతు వారోత్సవాలు

**హాలియా, ప్రభాతవార్త, మే 4:**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ రైతు వారోత్సవాలను మంగళవారం హాలియా, మాధరిగూడెం రోడ్‌లోని రీలీ గార్డెన్లో నిర్వహిస్తున్నట్లు నాగార్జునసాగర్ ఉద్యాన శాఖ అధికారి కే. మురళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుందూరు జైవీర్ రెడ్డి హాజరవుతారని, ఈ సమావేశంలో ఉద్యాన పంటల విస్తరణ, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహం, పంటల వైవిధ్యీకరణ అవసరం, ప్రభుత్వ పథకాలపై అవగాహన వంటి అంశాలపై నిపుణులు వివరించనున్నారు. ఉద్యాన రైతులకు ఉచితంగా రూ. 1000 విలువైన



కూరగాయల కిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కిట్లు పొందేందుకు రైతులు భూమి పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, బ్యాంక్ ఖాతా పాస్‌బుక్ జిరాక్స్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. ఉద్యాన రైతులు అందరూ ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొని, ప్రభుత్వ పథకాలపై అవగాహన పొందడంతో పాటు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు

# 1.54 కోట్ల పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

**త్రాగునీరు విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి**

**మున్సిపల్ చైర్మన్ చిన్న వెంకటరెడ్డి**

**నేరేడుచర్ల మే 4 ప్రభాతవార్త** నేరేడుచర్ల పురపాలక సంఘం పరిధిలో 202526 సంవత్సరంలో 32 అంశాలకు 1.54 కోట్ల రూపాయల పనులకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లుఆమోదం తెలిపారు , సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు, చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యుల గౌరవ వేతనాలు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, చేపట్టిన అభివృద్ధి పనుల పన్నులు, స్టేషనరీ, మొక్కలకు, కోతులు కుక్కల పట్టివేతకు, బ్లీచింగ్ పౌడర్, దోమల ఫాగింగ్, పారిశుద్ధ పరికరాలు తదితర పనులకు సమావేశం ఆమోదం తెలిపింది, ఈ సమావేశంలో చైర్మన్ చిన్నవెంకటరెడ్డి మాట్లాడుతూప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి సమస్య, విద్యుత్ సమస్యల ను యుద్ధ ప్రాతిపదికన పరిష్క రించడానికి చర్యలు తీసుకుంటామన్నారు, కౌన్సిలర్లు సమస్యలను సమావేశాలలోనే కాకుండా ప్రతినిత్యం వార్డులను పర్యవేక్షిస్తూ కమిషనర్, సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి సహకరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలని సూచించారు, అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు, ట్రాన్స్ఫార్మర్ల కెపాసిటీ పెంచడానికి అవసరమైన చోట ఏర్పాటు చేయడానికి అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు, ఈ ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీ పరిధిలో 32 అంశాలకు సంబంధించిన కేటాయించిన ప్రతిపాదించిన నిధులు అవసరమైనప్పుడు ఆయా ప్రాంతాలకు కేటాయించి ఖర్చు చేస్తామని వెల్లడించారు, 14వ వార్డు కౌన్సిలర్ అర్రురి విజయలక్ష్మి మాట్లాడుతూ 14వ వార్డులో మురికి కాలువల సమస్యలు ఉన్నాయని, చెత్త సేకరించడానికి వాహనాలను సిబ్బందిని పెంచాలని, రాఘవేంద్ర కాలనీలో లోపలికి సమస్య ఉన్నందున నూతనంగా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టికి తెచ్చారు, 11 వ వార్డు కౌన్సిలర్ షాహిన్ మాట్లాడుతూ



గతంలో చెత్త సేకరణకు వారానికి ఒకసారి వాహనం వచ్చేదని ప్రస్తుతం నెలకు ఒకసారి మాత్రమే వస్తుందని, మురికి కాలువల నుండి తీస్తున్న చెత్తను వెంటనే తరలించడం లేదని, బ్లీచింగ్ పౌడర్ పంపిణీ చేయాలని కోరారు, 13వ వార్డు కౌన్సిలర్ బొలిశెట్టి లక్ష్మయ్య వార్డులో కండక్టర్ వైరు తరచూ తెగిపోవడం వలన విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడడంతో ప్రజల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని విచారణ వ్యక్తం చేశారు, 12వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ కలీం కోతుల బెడద అధికంగా ఉందని, మిషన్ భగీరథ నీటి కోసం సరఫరా ఇచ్చారు కానీ నల్లాలు బిగించలేదని తెలిపారు, ఏడవ వార్డు కౌన్సిలర్ వాస జ్యోతి మాట్లాడుతూ మూడు వార్డులకు చెత్త సేకరణకు ఒకే వాహనాన్ని ఏర్పాటు చేయడం వలన చెత్త బండి సకాలంలో రావడంలేదని తెలిపారు, కౌన్సిలర్ ఇంజమూర్ శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాల వెనుక ఉన్న మంచినీటి బోరు పనిచేయడం లేదని, శివాజీ నగర్ లో చివరి ఇండ్లకు తాగునీరు అందడం లేదని పేర్కొన్నారు, కో ఆప్షన్ సభ్యుడు అలక శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ ఐదవ వార్డులోని నరసయ్య కోవడానికి మిషన్ భగీరథ మీరు రావడం లేదని, వెంచర్లలో నిర్మించిన గృహాలను మున్సి పాలిటీకి అప్పగించినందున విద్యుత్ సమస్యలు పరిష్క రించాలని కోరారు, 8వ వార్డు కౌన్సిలర్ తాళ్ల లావణ్య మాట్లాడుతూ స్థానిక కోట్లగడ్డలో 8 విద్యుత్ స్తంభాలు కూలిపోయినందున వాటి స్థానంలో నూతన స్తంభాల ఏర్పాటు చేయాలని కోరారు, 2 వార్డులో మిషన్ భగీరథ నీరు అందడం లేదని కౌన్సిలర్ యారవ లక్ష్మి సమావేశం దృష్టికి తెచ్చారు, కోఆప్షన్ సభ్యురాలు పొనుగోటి శోభ మాట్లాడుతూ అంజలి స్కూల్ వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీ పెంచి ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు, కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పైప్ లైన్ ల నిర్మాణం కోసం తవ్విన రహదారులను మరమ్మతులు చేయించాలని కోరారు, ట్రాన్స్కొ ఎఇ సృజన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ట్రాన్స్ఫార్మర్లను తనిఖీ చేసి ఓవర్ లోడ్ ఉంటే అదనపు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం ఉన్న విద్యుత్తు లైన్ల సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని, నూతన లైన్లుఏర్పాటు కోసం ప్రతిపాదనలుపంపుతామన్నారు, ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి, కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, మేనేజర్ యాకుబ్ పాష, మున్సిపల్ ఏఈ స్వాతి, మిషన్ భగీరథ ఏఈ శ్రీనాథ్ కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

**వ్యవసాయ అధికారి ప్రీతం కుమార్**

**గరిడేపల్లిలో ఘనంగా రైతు వారోత్సవాలు**

**రైతులకు ఆరోగ్య కార్డుల పంపిణీ**

**ప్రకృతి వ్యవసాయంపై అవగాహన**



**గరిడేపల్లి, మే 4, ప్రభాతవార్త :** రైతులు సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారి ప్రీతం కుమార్ కోరారు. మండలంలోని ఐదు రైతు వేదికలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం రైతు వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగం వ్యవసాయం సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులు వినియోగించాలని సూచించారు. సహజ సిద్ధమైన వ్యవసాయం ద్వారా పెట్టుబడి తగ్గడంతో పాటు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. సరైన పద్ధతిలో, మోతాదులు సరైన సమయంలో ఎరువుల యాజమాన్యం పాటిస్తే తెగుళ్ళు, పురుగుల బెడద ఉండదని తెలిపారు. సాంప్రదాయ యూరియాతో పోల్చితే నానో యూరియా వినియోగించడం ద్వారా రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. వీటి వినియోగంపై గత నెలలో మట్టి నమూనాలను సేకరించిన కొందరి రైతుల ఫలితాల కార్డులను కూడా అందజేయడం జరిగిందన్నారు. నానో యూరియా వాడటం ద్వారా ఇది నేరుగా పత్రాలపై పడి పత్ర రంధ్రాల ద్వారా అమోనికల్ నైట్రైట్ రూపం నుంచి నైట్రేట్ రూపంలోకి మారి మొక్క అంతటికీ సుమారు 80 వరకు లభ్యమవుతుందని తెలిపారు. దీంతో పాటు ఇది వాతావరణానికి హానికరం కాదని వివరించారు. రైతులంతా ఎరువుల నియంత్రణ పాటిస్తూ ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని, ఇది మానవాళి మనుగడకు ఎంతో అవసరమని తెలిపారు. అవసరానికి మించి ఒకే విడతలు ఎరువుల వాడకం చేయకూడదని, విడతల వారీగా ఎరువులను వాడటం వల్ల మొక్కలు సమతుల్యంగా పెరుగుతాయని తెలిపారు. రైతులందరూ సమగ్ర ఎరువుల యాజమాన్యం, పోషకాల సమతుల్యత, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి సరైన యాజమాన్యం పాటించాలని కోరారు. మండలంలోని ఉన్న ఐదు రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారుల ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలను నిర్వహించారు. ఈ వారోత్సవాలలో సంబంధిత గ్రామాల రైతులు పాల్గొన్నారు. రైతు వ్యవసాయ విస్తరణ అధికారులు ఆధునిక వ్యవసాయం సాగుపై, ప్రకృతి వ్యవసాయంపై, సేంద్రియ సాగుపై, జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షా విధానం, ఎరువుల సమతుల్యత, నానో ఎరువుల వినియోగం పై వివరించారు. అనంతరం రైతులకు పంటల వారీగా నీటి నిర్వహణ, పంటల మార్పిడి, పచ్చిరొట్టల ప్రాధాన్యత పై అవగాహన కల్పించారు. ప్రతి రైతు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని దీని ద్వారా భూమిలో పోషకాల లోపాలను గుర్తించి తద్వారా సమగ్ర పోషక యాజమాన్యం పాటించవచ్చని తెలిపారు. ప్రభుత్వం రెవెన్యూ గ్రామానికి సార పరీక్షల నిర్వహణ కోసం వాలంటీర్లను నియమించిందని వీరి ద్వారా భూసార పరీక్షలు నిర్వహించి పోషక లోపాలను గుర్తించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. వారోత్సవాల్లో పాల్గొన్న రైతులచే నేల ఆరోగ్యాన్ని కాపాడతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంబంధిత గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## ఈదురు గాలులకు12 ఎకరాలలో 550 లక్షల మామిడి పంటకు నష్టం

**నేరేడుచర్ల మే 4 ప్రభాతవార్త**



నేరేడుచర్ల మండలంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు వడగండ్ల వానకు బక్కయ్య గూడెం గ్రామంలో 12 ఎకరాలలో 11 టన్నుల మామిడి పంట దెబ్బతిని 550 లక్షల రూపాయల నష్టం వాటిల్లింది, రైతుల వివరాల ప్రకారం కరణం నరసయ్య నాలుగు ఎకరాల లో నాలుగు టన్నులు మామిడి పంట దెబ్బతిని 2 లక్షల రూపాయలు, కరణం అరవింద్ నాలుగు ఎకరాల లో 5 టన్నుల మామిడి పంట నేలరాలి 250 లక్షలు, కరణం వీరభద్రయ్య నాలుగెకరాల మామిడి తోటలో 2 రెండు టన్నులు నేలరాలి ఒక లక్ష రూపాయలు కు నష్టం వాటిలినట్లు తెలిపారు, ప్రభుత్వం తగు సహాయం అందించాలని రైతుల కోరారు

## వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఖాయం

**హుజూర్ నగర్ టౌన్, మే 4, ప్రభాత్ వార్త :**



రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి జెండా ఎగరడం ఖాయమని బిజెపి పట్టణ పార్టీ అధ్యక్షుడు కొండా హరీష్ గౌడ్ అన్నారు. సోమ వారం పలు రాష్ట్రాల్లో బిజెపి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ హుజూర్ నగర్ లో స్వీట్లు పంచిపెట్టి సంబరాలు నిర్వహించి అనంతరం నిర్వహించిన బిజెపి ముఖ్య నాయకుల సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లా డుతూ దేశంలో పశ్చిమ బెంగాల్, అసోమ్ రాష్ట్రాల్లో పాటు తమిళ నాడు, పుదుచ్చేరిలలో ఫలితా లలో బిజెపి అనుబంధ పార్టీలే గెలిచాయని అన్నారు. ముఖ్యంగా 15 సంవత్సరాల మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గద్దె దించి పశ్చిమ బెంగాల్ లో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. ప్రధాన నరేంద్ర మోడీ అమిత్ షా ల నాయకత్వము లో దేశంలో సుభిక్ష పాలన అమలవుతుందన్నారు. ఈ సమావేశం లో బిజెపి నాయకులు పిడమర్తి చంద్రయ్య, సోమగాని ప్రదీప్ గౌడ్, గుండా గోపి, బల్వంత్ సింగ్, రాళ్లబండి రామారావు ఇతర బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీస్వయంభూ శివలింగమునకు ఏకాదశ రుద్రాభిషేక ములు

**మేళ్ళచెర్వు మే 4 ప్రభాతవార్త:**

స్థానిక శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామివారి ఆలయములో సోమవారం సంధర్భముగా శ్రీస్వయంభూశివలింగమునకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాబి షేకములు, బిల్వాఅర్చనలు, పంచామృత అభిషేకములు, నందీశ్వరునికి విశేషఅర్చనలు, ఆరాధనలు, మహా లింగార్చన, హారతులు, దైవనామస్మరణ భజనలు, గుడిసేవలు, అన్న ప్రసాద వితరణ, విశేషఅర్చనలు, ఆరాధనలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో కార్యనిర్వహణాధికారి నాగేళ్ళ శంభిరెడ్డి, వెండ్లి లచ్చయ్య, కొంకపాక శివవిష్ణువర్ధనశర్మ, శివధనుంజయశర్మ, సాయిమహేశ్ శర్మ, కూన్రెడ్డి కొండారెడ్డి, లంకెల నర్సింహారెడ్డి, ధర్మకర్తలు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దిష్టిబొమ్మ దహనం

**యాదగిరిగుట్ట మే 04, (ప్రభాత వార్త ):**

యాదగిరిగుట్ట పట్టణం లో టిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్రావుపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. యాదగిరిగుట్ట పట్టణంలో ప్రధాన రోడ్డుపై నిరసన ర్యాలీని చేపట్టారు. ఖబర్దార్ అయిలయ్యఖి బీర్ల అయిలయ్య డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద బీర్ల అయిలయ్య దిష్టి బొమ్మ దహనం చేశారు. 6 సార్లు ఎమ్మెల్యేగా, ఇరిగేషన్ శాఖ, ఆర్థికశాఖ, వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఈ రాష్ట్రానికి సేవ చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు హోదాను మరిచి, అదిష్టానం మెప్పు కోసం నోటికి వచ్చినట్టుగా మాట్లాడితే సహించేది లేద న్నారు. మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలన్నారు. అధికారంలో ఉన్నామని విర్రవీగి నోరు జారితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఇప్పటివరకు వరిధాన్యం కొనుగోళ్లు కేంద్రాల్లో 30 శాతం వడ్లను కొనుగోలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో రైతులే కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వెంటనే హరీష్ రావుకు క్షమాపణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ మాజీ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి, యువజన విభాగం నాయకులు ముక్కర్ల సతీష్ యాదవ్, బాలయ్య, సర్పంచ్ గడ్డం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మార్సీలో ఆనందోత్సాహాల మధ్య సత్కారం

**స్కూల్ టాపర్స్, మండల మొదటి పది ర్యాంకర్స్ కు సన్మానం......**

**ప్రోత్సాహక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎంఈఓ చందా రమేష్**

**రాజాపేట, మే 4 ప్రభాతవార్త**



రాజాపేట మండల విద్యాశాఖ అధికారి చందా రమేష్ నూతన ప్రోత్సాహక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థు లను గౌరవిస్తూ అభినందిస్తూ సత్కారం చేశారు. నూరు శాతం విద్యార్థుల హాజరు 100 ఉత్తీర్ణత అత్యుత్తమ మార్కులు, జిల్లాస్థాయి ర్యాంకులు ఇలా అనేక ప్రత్యేక రికార్డులు సాధించడంతో ఎంఈఓ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యములో పదవ తరగతి టాపర్స్ కి సత్కారం చేశారు. రాజాపేట మండల కేంద్రంలో 10 వ, తరగతి పరీక్షా ఫలితాలలలో మొదటి పది స్థానాలలో ర్యాంకులు వచ్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మొదటి స్థానము వచ్చిన విద్యార్థులకు చిరు సత్కారం జరిగింది. ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ చందా రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో విద్యార్థులకు పై చదువులకు సంబంధించి అవగాహన కల్పించి దిశానిర్దేశ జరిగింది. ఈ సందర్భంగా మండలంలో మొదటి పది స్థానాలలో ఫలితాలు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులకు 500 పై మార్కులు సాధించిన దాదాపు 100 మంది విద్యార్థులకు మండల విద్యాశాఖ తరుపున అభి నందనలు తెలియజేశారు.విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని సలహాలు సూచనలు తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కె. మనోజ్ కుమార్, తడ్క రాజు, విజయలక్ష్మి, ఎల్. రవీంద్రా రెడ్డి, కె. కిరణ్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎం ఆర్ సి స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు. రాజాపేట మండలం లో పదవ తరగతి పరీక్షలలో మొదటి పది స్థానాలు పొంది సత్కారం పొందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వీరే : ప్రథమ స్థానంలో రఘునాథపురం ఉన్నత పాఠశాలకు చెందిన కె. ప్రజ్వల్, 569 మార్కులు, ద్వితీయ స్థానంలో చల్లూరు కు చెందిన జి. స్రవంతి, 567 మార్కులు, తృతీయ స్థానం లో రఘునాథపురం కు చెంది నఎస్. భానుశ్రీ, 565 మార్కులు, , నాల్గోవ స్థానంలో దూది వెంకటాపురం కు చెందిన జి. తేజస్విని 564 మార్కులు, , ఐదవ స్థానం ను రఘునాథ పురం ఉన్నత పాఠశాలకు బి. రాంతేజ్, 562 మార్కులు, , ఆరవ స్థానం లో రాజాపేటకు చెందిన కె. రిషిత 560 మార్కులు, , ఏడవ స్థానాన్ని రఘునాథపురం కు చెంది నపి. బిందు మాధవ్, 559 మార్కులు, ఎనిమిదవ స్థానం లో రఘునాథపురం విద్యార్థి ఎం. అజయ్, 558 మార్కులు, పదవ స్థానం లో రఘునాథపురం కు సంబంధించిన కె. సాధన 554 మార్కులు సాధించినట్లు ఎంఈఓ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి విద్యార్థుల పట్టుదల ప్రధానోపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ ప్రోత్సాహం వల్లే అత్యుత్తమ ఫలితాలు వచ్చినట్లు కృతజ్ఞతలు చెబుతూ ప్రత్యేకంగా అభినందించారు.

# యాదగిరి గుట్ట వార్త

# ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

**రాజాపేట, మే 4 ప్రభాతవార్త**



రాజాపేట మండల కేంద్రంలోని వరిమడ్ల నిర్మల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఐరెని నవీన్ కుమార్, స్వామి, మహేష్, ప్రశాంత్, కిషోర్, ప్రశాంత్ మహేష్, కుటుంబ సభ్యులు బంధువులు ఉన్నారు.

# ఎండ వేడి ప్రతాపం నుండి కాపాడుకునేందుకు పాడి ఆవుల రక్షణకు రైతన్నల పాట్లు

**రాజాపేట, మే 4 ప్రభాతవార్త**



రోజురోజుకు పెరుగుతున్న ప్రచండ భానుడి ప్రతాపం నుండి మనుషులు ఏదో రకంగా కాపాడుకునే ప్రయత్నాలు చేస్తుండగా, రైతన్నలు మాత్రం తమరి జీవనాధారమైన పాడియావుల రక్షణకు తిప్పలు పడుతున్నారు. పశువుల కొట్టాలు లేని, రేకులతో షెడ్డులు ఉన్న పాడి రైతులు తమ మూగజీవాలను ఎండ వేడి నుండి కాపాడుకునే ప్రయత్నాలు తోచిన విధంగా చేస్తున్నారు. కొందరు రైతులు పశువుల కొట్టాల చుట్టూ పరదాలు కట్టి నీటిని చల్లుతుండగా, మరికొందరు షెడ్ల పైన గడ్డి వేసి వాటిని నీటితో తడుపుతున్నారు. ఇంకొందరు చెట్ల నీడలో సేదతీరేలా చర్యలు తీసుకుంటున్నారు. తక్కువ పాడి గేదెలు ఆవులు ఉన్న రైతులు ఆవులపై గోనె సంచులు కట్టి తడి ఆరకుండా నీటిని చల్లుకుంటూ వస్తున్నారు. ఇలా కుటుంబ పోషణకు ఆధారమైన పాడి పశువులను ప్రస్తుత తీవ్ర ఎండల నుండి రక్షించుకునేందుకు రాజాపేట మండలంలోని రైతన్నలు నానా తంతాలు పడుతున్నారు.

# పంటల మార్పిడి, సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

**ఆలేరు, మే 4 (ప్రభాతవార్త):**



రైతులు పంటల మార్పిడి, సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి సూచిం చారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న రైతు వారం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలేరు మండలంలోని పటేల్గూడెం రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ యూరియా వినియోగం, పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయం, పచ్చిరొట్ట పంటల సాగు, నేల ఆరోగ్యం పరిరక్షణ, రసాయన మందుల వినియోగ విధానం, సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు తన కుటుంబ అవసరాలకు సరిపడ ధాన్యం, కూరగాయలను సేంద్రియ పద్ధతిలో పండించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ. మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్న వరి రకాలైన బీపీటీ 5204, ఆర్ ఎన్ ఆర్ 15048, కే ఎన్ ఎం 1638, జె జి ఎల్ 1798, జై శ్రీరామ్, హెచ్ ఎం టీ , డబ్ల్యూ జి ఎల్ 44, డబ్ల్యూ జి ఎల్ 1962 వంగడాలను సాగు చేయాలని సూచించారు. అలాగే భూసార పరీక్ష కోసం మట్టి నమూనాలు సేకరించే విధానాన్ని ప్రదర్శించి, విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి సి ఓ మురళి, జిల్లా ప్రజాపాలన స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, ఏఈఓ పవన్ కళ్యాణ్, పి ఏ సి ఎస్ సీఈఓ వెంకట్ రెడ్డి,మాజీ డైరెక్టర్ నర్సింహులు, పటేల్గూడెం సర్పంచ్ కుమారస్వామి, శ్రీనివాసపురం సర్పంచ్ శోభన్ బాబు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలి

**ఆలేరు, మే 4 (ప్రభాతవార్త):**



వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు భారదాన లారీల కొరతను వెంటనే పరిష్క రించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం ఆలేరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ను సిపిఎం ఆలేరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్లో గత 15 రోజులుగా వడ్లు పోసినా ఇప్పటివరకు కాంటలు పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా భారదాన కొరతతో రైతులు ఇబ్బందులు పడగా, ప్రస్తుతం లారీల కొరత కారణంగా కొనుగోళ్లు మందగించాయని తెలిపారు. తూకం అయిన వడ్లు మిల్లులకు తరలించకుండా మార్కెట్లోనే నిల్వ ఉండటంతో స్థలం కొరత ఏర్పడి, రైతులు తమ కల్లాలలోనే వడ్లు పోసుకుని ఎదురుచూస్తున్నారని చెప్పారు.ఇలాంటి పరిస్థితుల్లో అనుకోకుండా వర్షం పడితే రైతుల శ్రమ వృథా అవుతుందని, తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్లో మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆలేరు మార్కెట్ యార్డులో సరిపడ సీసీ (కాంక్రీట్) సదుపాయం లేకపోవడంతో గుంతలు ఏర్పడి, వర్షం పడితే ధాన్యం మొలకెత్తే పరిస్థితి ఉందని తెలిపారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే స్పందించి, మార్కెట్ యార్డులో అవసరమైన సీసీ ఏర్పాటు చేసి రైతుల ధాన్యాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్, సిఐటియు నాయకులు మొరిగాడి రమేష్, రైతు సంఘం నాయకులు ఘనగాని మల్లేష్, మొరిగాడి అశోక్,సెంటర్ నిర్వాహకులు వస్పరి స్వామి, రైతులు ఇక్కిరి కొమరయ్య, పూల మహేందర్, బి. పాపిరెడ్డి, లక్కాకుల రమేష్, గాదరి రాములు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో నూతన కోర్సు ప్రారంభం

**తుర్కపల్లి, మే 4 ప్రభాత వార్త**



తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల లో ఈ విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్లో అకౌంట్స్, కామర్స్ ,ఎకనామిక్స్ (ఏ సి ఈ) కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ అంబటి శోభారాణి తెలిపారు. ఈ కోర్సు ద్వారా భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## యువతను మరింత ప్రోత్సహించాలి



**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త**

:జిల్లాలో పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఊతమిస్తూ, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడంలో జిల్లా యంత్రాంగం మరింత చురుకుగా వ్యవహరిస్తోంది. సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షతన నిర్వహించిన డీఐపీసీ టీఎస్ ఐపాస్ సమావేశంలో పరిశ్రమల అనుమతుల మంజూరు, అమలు పురోగతి, ప్రోత్సాహక పథకాల అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్‌తో పాటు రెవెన్యూ, పర్యావరణం, విద్యుత్, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక శాఖలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో టీఎస్ ఐపాస్ కింద వచ్చిన కొత్త పరిశ్రమల ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించారు. ప్రతి ప్రతిపాదనను సంబంధిత శాఖల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా సమీక్షించి, అర్హత కలిగిన పరిశ్రమలకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అనుమతుల ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం జరగకుండా టైమ్‌లైన్‌లను కచ్చితంగా పాటించాలని, పెండింగ్ ఫైళ్లను వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే అనుమతులు పొందిన పరిశ్రమలు స్థాపనలో ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఈ సమావేశంలో చర్చించారు. భూసంబంధిత అంశాలు, విద్యుత్ కనెక్షన్లు, నీటి సరఫరా, రోడ్డు సదుపాయాలు వంటి మౌలిక వసతుల విషయంలో ఎలాంటి అడ్డంకులు ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు వేగంగా ప్రారంభమైతేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న టిప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 12 మంది నిరుద్యోగ యువతకు మొత్తం రూ.35 లక్షల ఆర్థిక ప్రోత్సాహకాన్ని మంజూరు చేశారు. లబ్ధిదారులు తమ యూనిట్లను స్థాపించుకునే దిశగా బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలని, అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రం ముందుండాలని సూచించారు. ఈ పథకం ద్వారా సామాజికంగా వెనుకబడిన వర్గాల యువత స్వయం ఉపాధి రంగంలోకి రావడం ద్వారా ఆర్థికంగా బలపడతారని తెలిపారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. స్థానిక వనరులను ఆధారంగా చేసుకుని ఫుడ్ ప్రాసెసింగ్, హ్యాండ్లూమ్, అగ్రో ఆధారిత యూనిట్ల స్థాపనకు అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. పరిశ్రమల స్థాపనలో పారదర్శకత, వేగం ముఖ్యమని పేర్కొన్న అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, పెట్టుబడిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా 'సింగిల్ విండో' విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధికి కట్టుబడి ఉందని, జిల్లాను పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు

## ప్రజావాణి అర్జీలకు వేగవంతమైన పరిష్కారం

**యాదాద్రి భువనగిరి, బ్యూరో ప్రభాతవార్త :**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 60 అర్జీలను అధికారులు స్వీకరించగా, వాటిని సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా నిర్దిష్ట గడువుల్లో చర్యలు తీసుకోవాలని, ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ శాఖకు అత్యధికంగా 42 అర్జీలు వచ్చాయి. సర్వే ల్యాండ్‌కు 6, జిల్లా పంచాయతీకి 2, కోఆపరేటివ్ శాఖకు 2 అర్జీలు అందాయి. అలాగే ఎస్సీ వెల్ఫేర్, ఇరిగేషన్, మత్స్య శాఖ, ట్రాన్స్‌పోర్ట్,



మున్సిపాలిటీ, సివిల్ సప్లైస్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్ఓ జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి సహా వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**చౌటుప్పల్, మే 4 ప్రభాతవార్త :**



మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామపంచాయతీలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం జాతీయ రహదారి నుండి ఆరెగూడెం గ్రామానికి వచ్చే రోడ్డులో ఉన్న కనకదుర్గమ్మ గుడి ముందు చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక సర్పంచ్ ఎన్నెపల్లి ధనలక్ష్మి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో కామినేని హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్థులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో పంచాయతీ కార్యదర్శి డి. రాజేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు, వార్డు ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ లో బీజేపీ విజయోత్సవ సంబరాలు



**చౌటుప్పల్, మే 04 ప్రభాతవార్త :**

, అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించి, కాషాయ జెండా రెపరెపలాడిన సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. చౌటుప్పల్ పట్టణంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరంకొండ అశోక్ ల ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ వంటి కీలక రాష్ట్రాల్లో బీజేపీ అధికారం చేపట్టడం దేశాభివృద్ధికి చారిత్రక అవసరమని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో రాబోయే 2028 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కంకణబద్ధులై క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల భిక్షం గౌడ్, సీనియర్ నాయకులు రమణగోని శంకరయ్య, గుజ్జుల సురేందర్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, చినుకుని మల్లేశం, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, పాలకూర్ల జంగయ్య, దాసోజు బిక్షమాచారి, ఊడుగు యాదయ్య, వెంకటేశం, బత్తుల జంగయ్య, సర్పంచ్‌లు నందగిరి వెంకటేశం, బోయ మహేంద్రమణి శరత్ కుమార్, కౌన్సిలర్లు పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య, బుడ్డ సురేష్, ఆలే శ్రీలత చిరంజీవి, గోషిక నీరజ, దిండు భాస్కర్, పలువురు బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు




## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కలిసిన రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్

**చౌటుప్పల్ మే 4 ప్రభాతవార్త**



చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ దీప శ్యామ్ సుందర్ ముదిరాజ్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన రామలింగేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మెల్యే అందించిన సహకారానికి కృతజ్ఞతగా కలిసి ధన్యవాదాలు తెలిపినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## సుక్కేటి వాగును పునరుద్ధరించాలని ఆర్‌డిఓకు వినతి

**చౌటుప్పల్, మే 4 ప్రభాతవార్త**



ప్రభుత్వం ఆదేశాల మేరకు చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రజల నుంచి పలు సమస్యలకు సంబంధించిన అర్జీలను ఆర్డిఓ స్వీకరించారు. తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ బిఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ సోమవారం చౌటుప్పల్ ఆర్‌డిఓ శేఖర్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. దండుమైలారం, తూప్రాన్ పేట శివారు నుండి దండు మల్కాపురం, కైతాపురం చెరువు, ధర్మోజిగూడెం మీదుగా లక్కారం చెరువు వరకు, అక్కడి నుండి లింగోజిగూడ వరకు సుక్కేటి వాగు విస్తరించి ఉందని తెలిపారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా ఈ వాగును వెంచర్ల పేరుతో పూడ్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్కారం చౌటుప్పల్ మధ్య వాగుపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వాగు పునరుద్ధరణ వల్ల కైతాపురం, లక్కారం, చౌటుప్పల్ చెరువులు, కుంటలు నిండి భూగర్భ జలమట్టం పెరుగుతుంది. కొన్ని వందల ఎకరాల భూమి సాగులోకి వచ్చి రైతులకు, వ్యవసాయ కూలీలకు మేలు జరుగుతుంది. ఈ ప్రాంతంలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అధికారులు స్పందించి సుక్కేటి వాగుపై ఉన్న అక్రమాలను తొలగించి, వాగును పునరుద్ధరించడానికి చొరవ చూపాలని ఆయన కోరారు.

## లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి

**సంస్థాన్ నారాయణపురం, మే 4 ప్రభాతవార్త**



సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో రైతు వేదికలో ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి గారు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను సోమవారం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి హాజరై లబ్ధిదారులు సికిలమెట్ల లక్ష్మీ ప్రసన్న, బచ్చనబోని సృజన, బాకారం మమత, భూపని కావేరి, చిలువేరు ఉమామహేశ్వరి, కట్ల ఉషశ్రీ, కుర్మతి వసంత, నాతి సాయి గీత, రాచకొండ అశ్విని, రాసాల స్రవంతి, ఇష్టం సుప్రియ, చిలువేరు ప్రసన్న, మెగావత్ హరిత లకు తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుర పెల్లి వెంకటేష్, పందుల యాదగిరి గౌడ్, కట్ల వనజ భాస్కరాచారి, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, ఆర్ ఐ జుబేర్, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# రైతు వేదికల్లో రైతు వారోత్సవాలు

### రైతులకు సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ

### నానో ఎరువులు,మట్టి నమూనా పరీక్షలు,

### ప్రకృతి వ్యవసాయం పై అవగాహన



**హుజూర్ నగర్ రూరల్,మే 04,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం హుజూర్ నగర్ మండలంలోని హుజూర్ నగర్, లింగగిరి, శ్రీనివాస పురం, బూరుగడ్డ గ్రామాలలోని రైతు వేదికలలో రైతు వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా వ్యవసాయ విస్తరణ అధికారులు భూసార పరీక్ష విధానము, ఎరువుల సమతుల్యత,నానో ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించడం జరిగింది. రైతులకు పంటల వారీగా ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తూ, నీటి నిర్వహణ, పంటల మార్పిడి , పచ్చి రొట్ట పంటల ప్రాధాన్యత గురించి కూడా వివరించడం జరిగింది. అలాగే సమయానుకూలంగా పంటల పరిశీలన చేయడం ద్వారా తెగుళ్లు, పురుగులను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని దీని వల్ల పోషకాల లోపాలను గుర్తించి తద్వారా సమగ్ర పోషక యాజమాన్యం పాటించవచ్చని తెలిపారు. ప్రభుత్వం రెవెన్యూ గ్రామానికి ఒక సాయిల్ వాలెంటర్లను నియమించిందని వీరి ద్వారా గ్రామంలోని రైతుల పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి తద్వారా వచ్చిన భూసార పరీక్ష కార్డు ద్వారా పోషక లోపాలను గుర్తించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువుల వైపు రైతులు ఆలోచించాలని, సహజసిద్ధమైన వ్యవసాయం ద్వారా పెట్టుబడి తగ్గడంతో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. సరైన పద్ధతిలో సరైన మోతాదులో సరైన సమయంలో ఎరువులు యాజమాన్యం పాటిస్తే చాలావరకు తెగుళ్లు, పురుగుల బెడద ఉండదని వివరించారు. గత నెలలో మట్టి నమూనాలను సేకరించిన కొందరి రైతుల ఫలితాల కార్డులను కూడా అందజేయడం జరిగింది. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియాలో ఎంతో లాభదాయకంగా ఉంటుందని, ఇది నేరుగా పత్రాలపై పడి పత్ర రంధ్రాల ద్వారా అమోనికల్ నైట్రేట్ రూపం నుంచి నైట్రేట్ రూపంలోకి మారి మొక్క అంతటికి సుమారు 80 వరకు లభ్యమవుతుందని తెలిపారు. అలాగే ఇది వాతావరణానికి హానికరం కాదని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఏ వో స్వర్ణ, ఏ ఈ ఓ ముస్తఫా, సుకుమార్, శ్రీనివాస్ రెడ్డి, పశు వైద్యాధికారిణి, సర్పంచులు యరగాని రాధా నాగరాజు,మేడి సునీత రమణ, కట్టా శ్రీనివాస్ రావు రైతులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

### మండల వ్యవసాయ అధికారి జావేద్



**నేరేడుచర్ల మే 4 ప్రభాతవార్త** నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించ వచ్చని మండల వ్యవసాయ అధికారి జావేద్ సూచించారు, తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక99 రోజుల ప్రణాళిక లో భాగంగా సోమవారం మండలం లో చిల్లేపల్లి, కల్లూరు, దిర్శించర్ల రైతు వేదికలలొ నిర్వహించిన రైతు కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం,పంట రుణాలు వ్యవసాయ యాంత్రీకర ణమట్టి నమూనా ఎలా చేయాలో తదితర అంశాలపై రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో అవగాహన కల్పించారు, మట్టి నమూనా తీసిన రైతులకు సాయిల్ హెల్త్ కార్డు లను అందజేశారు,ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు అన్వేష్, నిర్మల, పి. సంధ్య, డి. సంధ్య, దిర్శించర్ల, జానల్ దిన్న, చిల్లపల్లి సర్పంచులుగ బుర్రి శ్రీనివాస్, గజ్జి సరిత, కోడిద అపర్ణ మనోజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, వార్డు మెంబర్లు, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు

# లింగగిరిలో పూర్వ విద్యార్థుల సందడి

### 40 ఏళ్ల తర్వాత కలిసిన బాల్య మిత్రులు



**హుజూర్ నగర్ రూరల్, మే04, ప్రభాతవార్త:** హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామం లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. 1985.86 విద్యాసంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం అత్యంత ఘనంగా జరిగింది. దాదాపు 40 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలిసిన విద్యార్థులు, తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. తమతో పాటు చదువుకున్న కొందరు బాల్య మిత్రులు మరణించడంతో తొలుత వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్ కె .జానీమియా, కే ఎల్ శ్రీనివాసరావు , జి వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు రాళ్లబండి నరసింహరాజును పూలమాలలు వేసి, శాలువాతో, మెమెంటో తో ఘనంగా సత్కరించారు.ప్రతి ఒక్కరిని శాలువాతో సన్మానించి, మెమెంటోను బహుకరించారు.ఈకార్యక్రమములో పి మట్టయ్య , పాలూరి సత్యనారాయణ, కుమ్మరికుంట్ల సత్యనారాయణ, కుతుబొద్దీన్ , సిహెచ్ లక్ష్మణరావు , వెంకటరెడ్డి, శ్రీనివాస రెడ్డి తదితరులు ఉన్నారు.

# త్రాగునీటి పథకాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**మేళ్ళచెరువు మే 4 ప్రభాతవార్త:**



స్థానిక మండల పరిషత్ కార్యాలయములో సోమవారం జరిగిన మండల స్థాయి గ్రామ పంచాయితీల కార్యదర్శుల సమావేశములో యం.పి.డి.ఓ. మహ్మద్ ఇసాక్ హుస్సేన్ మాట్లాడుతూ మండలములోని అన్ని గ్రామాలలో త్రాగునీరు మంచినీటి పథకాలపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఉపాధీ హామీ కూలీలకు టెంట్లు, మంచినీరు, ఓ.ఆర్.యస్. ప్యాకెట్లుతోపాటు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎండాకలములో ఎండలపట్ల అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పురవీధులు, మురికి కాలువలు పరిశుభ్రత కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశములో మహ్మద్ అబ్దుల్ ఫరీద్, ఆకాశపు పవన్ కుమార్, షేక్ మోసిన్, పందెళ్ళపల్లి గురవారెడ్డి, కొత్త ఉపేందర్, బొడ్డుపల్లి వీరబాబు, కనిశెట్టి నాగేంద్రబాబు, షేక్ రశీదు, బండి రామక్రిష్ణ, బాణోతు సునీత, కాంపాటి వెంకటేశ్వర్లు, దొంతగాని శ్యాముకుమార్, గోరుగంటి దీప్తి, చక్కెర రాజశేఖరరెడ్డితో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి విజయోత్సవం

**నేరేడుచర్ల మే 4 ప్రభాతవార్త**



ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి మూడు రాష్ట్రాల్లో బిజెపి పార్టీ గెలుపొంది అధికారం సాధించిన సందర్భంగా నేరేడుచర్లలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు, స్థానిక ప్రధాన కూడలి వద్ద పార్టీ కార్యకర్తలు బాణసంచా పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు కాలం నాగయ్య,ఏమిరెడ్డి శంకర్ రెడ్డి,రాష్ట్ర నాయకులు బాల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు తాళ్ల నరేందర్ రెడ్డి, సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి, బిజెపి నాయకులుమెట్టు శ్రీనివాసరెడ్డి, ఉరి మల్ల రామ్మూర్తి, మెట్టు మధుసూదన్ రెడ్డి, గంధం శావయ్య, కడారి ఎల్లయ్య, కాంపల్లి నారాయణరెడ్డి, తాటికొండ పరమేశ్వర్ రెడ్డి, వెన్న సురేష్, ఉమ్మడి శ్రీనివాస్ రెడ్డి, బుస్సా విమల, చేపూరి కృష్ణవేణి, దేవిరెడ్డి నాగిరెడ్డి, కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, రూపావత్ వెంకటేష్, , కోటేశ్వరరావు , కాట కృష్ణారెడ్డి బిజెపి కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి లో ప్రజల సమస్యలపై దరఖాస్తులు తీసుకోవాలి

**హుజూర్ నగర్ టౌన్, మే 4 ప్రభాతవార్త:**



రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు నియోజకవర్గ కేంద్ర మైన హుజూర్ నగర్ లోని ఆర్డీవో కార్యా లయంలో దరఖాస్తు చేసుకోని సమస్యలను తెలిపి వాటిని పరిష్కరించు కోవాలని ఆర్డీవో వి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆర్డిఓ కార్యా లయం లో డివిజన్ లోని వివిధ శాఖల అధికా రులతో కలిసి ఆయన ప్రజా వాణి కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు ఉదయం 10.30 నుండి 1.00 గంట వరకు ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు తీసు కోవడం జరుగుతుందని నియోజక వర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశం లో తహసిల్దార్ బండ కవిత, మున్సిపల్ కమిషనర్ బి శ్రీని వాస్, ఎం ఆర్ సి సైదులు, పంచాయతీ రా జ్ హౌసింగ్, విద్యుత్, వైద్య సిబ్బంది ఇతర అధికారులు పాల్గొ న్నారు

# అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

**హుజూర్ నగర్ రూరల్, మే04, ప్రభాతవార్త:**



మండలంలోని కరక్కాయల గూడెం అంగన్వాడి కేంద్రంలో సోమవారం గర్భిణీలు, బాలింతలకు గుడ్లు ,బాలామృతం పాలు ,బియ్యం, పప్పులు సర్పంచ్ మచ్చ వెంకటేశ్వర్లు పంపిణీ చేసారు. ఎదుగుతున్న చిన్నారులకు బాలామృతం వరం వంటిదని వెంకటేశ్వర్లు అన్నారు. కేంద్రం పరిధిలోని బాలింతలు ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టిక ఆహారం తీసుకొని రక్తహీనత సమస్యను అధిగమించాలని ఆయన సూచించారు. పోషకాహారం తీసుకున్నప్పుడే గర్భిణీలకు రక్తహీనత సమస్య రాకుండా ఉంటుందని పుట్టబోయే బిడ్డ సైతం ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతకుంట్ల సైదయ్య ,వార్డు మెంబర్ చింతకుంట్ల విజయ, అంగన్ వాడీ టీచర్ నూర్జహాన్ ,కమిటీ మెంబర్లు ,వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంకొండ ఈశ్వరమ్మ మృతికి సంతాపం

**హుజూర్ నగర్ టౌన్, మే 4, ప్రభాత వార్త :**



హుజూర్ నగర్ పట్టణానికి చెందిన బి ఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్ మాతృమూర్తి బెల్లంకొండ ఈశ్వరమ్మ మృతి బాధాకరమని టిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు, మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డిలు అన్నారు. సోమవారం మృతి చెందిన బెల్లంకొండ ఈశ్వరమ్మ భౌతిక కాయంపై పూల మాలవేసి వారు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్మన్ దొతకాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తస్నీరు మల్లికార్జునరావు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కోతి సంపత్ రెడ్డిలు ఇతర పార్టీ నాయకులు ఉండగా కుటుంబ సభ్యులు బెల్లంకొండ చిరంజీ వి, బెల్లంకొండ రామచంద్రు పాల్గొన్నారులు

# ధాన్యం కొనుగోళ్లను సమర్ధవంతంగా నిర్వహించాలి

### రాష్ట్ర మంత్రి ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తితో కలిసి మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో రక్షణ చర్యలు కచ్చితంగా చేపట్టాలని సూచించారు. టార్పాలిన్ కవర్లు సరిపడా అందుబాటులో ఉంచాలని, రైతులు తమ ధాన్యం కుప్పలను ఎత్తైన ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు. గాలుల ప్రభావంతో కవర్లు ఎగిరిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు తెలియజేయాలని అన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు చేరవేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, షామియానాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. తేమ కొలిచే యంత్రాలు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు సిద్ధంగా ఉంచాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని చెప్పారు. ఎక్కడా జాప్యం లేకుండా హమాలీలు, వాహనాల సమీకరణ చేయాలని, ప్రతి కేంద్రాన్ని గ్రామ, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. మే నెలాఖరుకల్లా 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ అన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు సరిపడా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజూ కొనుగోలు వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఓపీఎంఎస్‌లో వెంటనే వివరాలు అప్‌లోడ్ చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం త్వరగా తరలింపునకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అకాల వర్షాల ప్రభావంతో ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేంత వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి రోజారాణి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## తిమ్మాపురం ఐకేపీ పీపీసీ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**జాజిరెడ్డిగూడెం, మే 04 (ప్రభాత వార్త):**

జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఉన్న ఐకేపీ పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సోమవారం సాయంత్రం సందర్శించి తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తూకం విధానం, రైతులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ధాన్యం నిల్వ, రవాణా, చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ బి. శ్రీకాంత్, ఎస్ఐ ఈ. సైదులు, ఏపీవో రాంబాబు,, ఊర సత్యనారాయణ, బొల్లం బాలరాజు, రైతులు, అధికారులు పాల్గొన్నారు

## ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేయాలి

### ఆర్మూరు శాసనసభ్యులు రాకేష్ రెడ్డి

**భువనగిరి రూరల్ మే 4 ప్రభాతవార్త**

బిజెపి జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ అధ్యక్షతన పట్టణకేంద్రంలోని ఎమ్మెన్నార్ గార్డెన్స్ లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్మూరు శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి నీఅంతలా వ్యవహరించడంతో ప్రజా ఆగ్రహానికి గురైందని, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజా పాలన పేరుతో అనేక హామీలు ఇచ్చి అమలు చేయడంలో విఫలం చెందారని అన్నారు. రైతులను, యువకులను, మహిళలను అందరినీ మోసం చేస్తూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడం ఎంతవరకు కరెక్ట్ అని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని గుర్తు చేశారు. ఆయన అన్నారు. రైతుబంధు కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే గుర్తుకొస్తుందని ఎన్నికలబందుగా మార్చుకోవాలని సూచించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బిజెపి దూసుకుపోతుందని, తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని సూచించారు. ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరగనున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ



శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి తాడూరు శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం, తుమ్మల మురళీధర్ రెడ్డి, మాయ దశరథ, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, బోయినపల్లి గోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జైనపల్లి శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, గూడూరు నరోత్తం రెడ్డి, కొప్పుల యాదిరెడ్డి, కాదురి అచ్చయ్య, చందా మహేందర్, తడిసిన మల్లారెడ్డి, వైజయంతి, మేడి కోటేష్, లక్ష్మీనారాయణ, కామిటికారి కృష్ణ, ఆకుతోట రామకృష్ణ, మంగు నరసింహారావు, దుర్గా పతి లక్ష్మీనారాయణ, పట్నం కపిల్ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, మండల అధ్యక్షులు చీర్క సురేష్ రెడ్డి, సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు

## పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**చౌటుప్పల్ మే 4 ప్రభాతవార్త**



పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో మంజూరైన ఇండ్లను సోమవారం తాళ్ల సింగారంలో సర్వే నవనీత నూతన గృహప్రవేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారంగా ప్రాధాన్యత క్రమంలో హామీలను అమలు చేసే దిశగా ముందుకు సాగుతుందన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో చౌటుప్పల మున్సిపాలిటీని అని రంగాల్లో మరింత అభివృద్ధి చేయడం కోసం నిరంతరం పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డ్ కౌన్సిలర్ కోసం రాకేష్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహ గౌడ్, మార్కెట్ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## హైకోర్టు తీర్పుతో..

**యాదాద్రి భువనగిరి, బ్యూరో ప్రభాతవార్త**

ఇన్‌చార్జ్ విధానానికి గుడ్‌బై..
హైకోర్టులో ప్రభుత్వానికి చుక్కెదురు
సహకార సంఘాల్లో పాత కమిటీల పునరాగమనం
ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సహకార కమిషనర్
నేడు తిరిగి బాధ్యతలు స్వీకరించనున్న పాత పాలకవర్గ సభ్యులు

: రాష్ట్ర సహకార రంగంలో కీలక మలుపు తిరిగింది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవడం, ఉన్నత న్యాయస్థానం తాజా తీర్పు వెలువడటంతో సహకార సంఘాల పాలనలో విస్తృత మార్పులు చోటుచేసుకున్నాయి. జిల్లా సహకార అధికారి సోమవారం జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ మార్పులు తక్షణమే అమల్లోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 19 ,2025న జారీ చేసిన ఉత్తర్వును రద్దు చేయడం ఈ పరిణామాలకు ప్రధాన కారణంగా నిలిచింది. ఈ అంశంపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, ఫిబ్రవరి 14 ,2025న నాటికి ఎన్నికైన నిర్వహణ కమిటీలనే కొనసాగించాలని స్పష్టం చేసింది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఏర్పడిన కమిటీలకే ప్రాధాన్యం ఇవ్వాలని తన తీర్పులో పేర్కొనడంతో ఇప్పటి వరకు అమల్లో ఉన్న ఇన్‌చార్జ్ విధానానికి పూర్తిగా తెరపడింది. ఈ నిర్ణయం మేరకు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా సహకార సంఘాల్లో ఫిబ్రవరి 14 2025 నాటికి ఉన్న ఎన్నికైన నిర్వహణ కమిటీలు తిరిగి బాధ్యతలు స్వీకరించనున్నాయి. ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ అధికారులు తమ వద్ద ఉన్న నగదు, రికార్డులు, నిల్వలు, ఆస్తులు, లావాదేవీల వివరాలను సంబంధిత కమిటీలకు అప్పగించాలని జిల్లా సహకార శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అప్పగింత ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అవసరమైతే ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించింది. గత కొంతకాలంగా జిల్లాలో సహకార సంఘాలు ఇన్ చార్జ్ అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ విధానంపై సభ్యులు, రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఎన్నికైన ప్రతినిధుల స్థానంలో అధికారులను నియమించడం వల్ల సభ్యుల భాగస్వామ్యం తగ్గిందని, నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నారని ఆరోపణలు వినిపించాయి. రుణాల మంజూరు, ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో ఆలస్యం, అస్పష్టత నెలకొన్నదని రైతులు పేర్కొన్నారు. ఇప్పుడు కమిటీల పునరాగమనం నేపథ్యంలో సహకార రంగంలో మళ్లీ ప్రజాస్వామ్య పరిపాలన బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. సభ్యుల భాగస్వామ్యం పెరగడం, గ్రామ స్థాయిలో నిర్ణయాలు త్వరగా తీసుకోవడం, రైతులకు సేవలు మరింత చేరువ కావడం వంటి ప్రయోజనాలు కలుగనున్నాయని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా యాసంగి, వానాకాల సీజన్లలో ధాన్యం కొనుగోలు, పంట రుణాల మంజూరు, ఎరువులు, విత్తనాల సరఫరాలో సమన్వయం మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని రైతు సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. అయితే కొత్తగా బాధ్యతలు చేపట్టే కమిటీలకు సవాళ్లు కూడా ఉన్నాయి. గతంలో పేరుకుపోయిన బకాయిలు, నిల్వ సమస్యలు, ఆర్థిక అక్రమాలు ఉన్నచోట వాటి పరిష్కారం ప్రధాన బాధ్యతగా మారనుంది. లెక్కల వ్యవస్థను పటిష్టం చేయడం, తనిఖీలను సమయానికి పూర్తి చేయడం, సభ్యుల విశ్వాసాన్ని తిరిగి పొందడం కీలకం కానుంది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనను పాటించాల్సి ఉంటుంది. జిల్లా సహకార శాఖ ఇప్పటికే అన్ని సంఘాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసింది. కమిటీలు బాధ్యతలు స్వీకరించిన వెంటనే వారి పనితీరును సమీక్షించేందుకు మండల, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నట్లు సమాచారం. అవసరమైతే శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించి, సభ్యులకు పరిపాలనా, ఆర్థిక నిర్వహణపై అవగాహన కల్పించనున్నారు. మొత్తానికి ఉన్నత న్యాయస్థానం తీర్పుతో జిల్లాలో సహకార రంగానికి కొత్త ఊపిరి లభించింది. ఇన్‌చార్జ్ విధానానికి ముగింపు పలుకుతూ ఎన్నికైన కమిటీల పునరాగమనం రైతులు, సభ్యుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమర్థవంతమైన పరిపాలన అందిస్తేనే సహకార సంఘాలపై విశ్వాసం మరింత బలపడుతుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 107 సహకార సంఘాల్లో తిరిగి పాత పాలకవర్గ సభ్యులే నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు. అందులో యాదాద్రి భువనగిరి జిల్లాలో 21 సహకార సంఘాల్లో నేడు పాత పాలకవర్గ సభ్యులు తిరిగి పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు.

## సాంప్రదాయంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

రాజాపేట, మే 4 ప్రభాతవార్త



రాజాపేట మండలం రేణిగుంట గ్రామ రెవెన్యూ పరిధిలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారం సాంప్రదాయంగా జరిగింది. బోళ్ల ఇందిరా నర్సిరెడ్డి దంపతులు కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి ఆహ్వానించగా గుత్త రజిని జగన్ రెడ్డి, తోకల అశ్విని కరుణాకర్ రెడ్డి పుణ్య దంపతులు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. 11:45 లకు ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చలివేదుల రాజేశ్వర శర్మ జోషి మల్లికార్జున శర్మ బృందం వేదమంత్రోచ్ఛారణల మధ్య జరిగింది. అంతకుముందు ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం రిత్విక్ మరణం, అఖండ దీపారాధన ద్వజారోహణం, దేవతాఆహ్వానం నం జలాధివాసం, పుష్పాదివాసం షయ్యాదివాసం, గర్తాన్యాసం, అనంతరం భక్తుల జయ జయ ద్వానాల మధ్య శ్రీ స్వామి వారి మూలమూర్తి యంత్ర ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. బలిహరణ, పూర్ణాహుతి, మహదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు రేగొండ పాండురంగం, బోళ్ల ఇందిర నర్సిరెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు రేణిగుంట గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రఘునాథపురంలో నేతన్నకు ఆరోగ్య భద్రత క్యాంపు....

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్...



**రాజాపేట మే 4 ప్రభాతవార్త** నేతన్నకు ఆరోగ్య భద్ర త ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామము లో చేనేత కార్మికులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వ హించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ ప్రారంభించారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజిషియాన్, ఆర్థో, కంటి పరీక్షలు నిర్వహ్నిచారు. సుమారు 99 మంది చేనేత కార్మికులు వైద్య పరీక్షలు చేయించు కున్నారు ఈ శిబిరమును జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వంశీ కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమములో మండల వైద్యాధికారి డాక్టర్ మోస్సెస్ రాజ్, జనరల్ ఫిజీషియన్, డాక్టర్ కిరణ్ ఆర్థోపెడిక్, డాక్టర్ నబీలా ఆప్తమాలజిస్ట్, సూపర్వైజర్ విజయలక్ష్మి , చైతన్య, మానస, ఉషారాణి హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్, కవిత , టీబి సూపర్ వైసర్ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ నటేష్, ఎక్సరే టెక్నీషియన్ ఉమేష్ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజాపేటలో బిజెపి సంబరాలు

రాజాపేట మే 4 ప్రభాతవార్త



పశ్చిమ బెంగాల్ లో బీజేపీ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భం లో సోమవారం రాత్రి రాజపేట మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యం లో సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి, ,మోడీ గారి చిత్ర పటానికి పాల అభిషేకం చేసారు. ఈ కార్యక్రమం లో మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు మేకల రమేష్, మాజీ అధ్యక్షులు కాయితి బాలరెడ్డి , ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్ రెడ్డి ,రాజాపేట పట్టణ అధ్యక్షులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి దేవస్థానం భూ నిర్వాసితుల ఆక్రందన

న్యాయం చేయాలని కోరుతూ దేవదాయ శాఖ కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన భూ నిర్వాసితులు



**యాదగిరిగుట్ట మే 4 ప్రభాతవార్త** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసిం హ స్వామి దేవస్థానం అభివృ ద్ధిలో భాగంగా కొండకిందగల విష్ణు పుష్కరిణి, అన్నదానం, సత్యనారాయణ వ్రత మండ పాల నిర్మాణాలకు భూమిని అందజేసిన భూ నిర్వా సితు లు దేవాదాయ శాఖ కమిష నర్ హనుమంత రావు కు తమ గోడును వెళ్ళబోసు కుంటూ వినతి పత్రాన్ని అందజేశారు.... దేవాల యాన్ని వై టి డి ఏ ఆధ్వర్యం లో అభివృద్ధి చేసిన క్రమంలో తాము తమకు ఆధారమై నటువంటి భూమిని దేవాల య అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు తమ భూమిని అందజేశామని భూ నిర్వాసితులు తెలిపారు. కానీ దానికి పరిహారంగా కొంత డబ్బు మాత్రమే తమకు అంద జేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కొండపైన దేవాలయ అభివృద్ధికి ఏమీ ఇవ్వనటువంటి వారికి దేవ స్థానం మాత్రం కొండపైన దుకా ణాలు వంటి వాటిని ఉపాధి కోసం అందజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయం అభివృద్ధి కోసం భూమి ఇచ్చిన తమకు కొంత డబ్బు ఇచ్చి ప్రభుత్వం చెయ్యి దులుపుకుందని తెలిపారు. భూమిని కోల్పోయిన తాము దానిపై ఉపాధిని సైతం కోల్పోయామని వారన్నారు. తమ ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కొండపైన దుకాణాలను అయినా,లేదా దేవస్థానంలో ఉపాధిని అయినా ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. దేవాలయానికి అప్పగించిన భూమిని కోల్పోయి ఉపాధిని కోల్పోయి చివరికి దిక్కుతోచని స్థితిలో కొంతమంది ప్రాణాలు సైతం కోల్పోయారని వినతిపత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా తమకు కొండపైన దుకాణాలనైనా లేదా దేవస్థానంలో ఉపాధి నైనా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బూడిద సురేందర్,బూడిద నాగరాజు, బూడిద నవీన్ కుమార్, బూడిద జానీ,బూడిద నరసింహ, బూడిద రాములు,బూడిద యాదగిరి,బుగ్గ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## యదేచ్ఛగా చెరువులో నల్ల మట్టి తరలింపు

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

రాత్రింబవళ్లు పరుగులు తీస్తున్న నల్లమట్టి టిప్పర్లు

పట్టించుకోని ఇరిగేషన్,రెవెన్యూ అధికారులు

**మోటకొండూర్, మే 04, ప్రభాతవార్త;** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండ లంలో వర్టూరు గ్రామపం చాయతీ పరిధిలోని గంగబావి సమీపంలో ఉన్న చెరువు నుంచి అడ్డూ, అదుపు లేకుండా మట్టి తరలిస్తున్నారు.హిటాచీల సహాయం తో వందల టిప్పర్లతో రాత్రింబవళ్లు మండల కేంద్రంలో దుమ్ము లేపుకుంటూ ఓవర్ లోడ్లతో వేగంగా వెళ్తూ గ్రామ ప్రజలను భయ భ్రాంతు లకు గురిచేస్తున్నారు. గ్రామస్తులు,ప్రయాణికులు రోడ్డుపై వెళ్లాలంటే దుమ్ము ధూళితోప్రయాణికులకు నర కయాతనంగా ఉందని అంటున్నారు.చెరువు మట్టిని ఇటుక బట్టీలకు జిల్లాలోని వివిధ మండలాలకు తరలిం చడమే కాకుండా ఇతర జిల్లాలకు తరలిస్తూ కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు కొంత వరకే ఉన్న చెరువుల్లో ఇష్టారీతిగా మట్టి తవ్వుతున్న ఇరిగేషన్ అధికారులు,నిబంధ నలు ఉల్లంఘిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చెరువుల్లో మట్టి తవ్వకంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. కాంట్రాక్టర్ల,అధికారుల వ్యవహారం తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





## యాదగిరిగుట్ట లో బీజేపీ సంబరాలు

యాదగిరిగుట్ట మే 04 (ప్రభాత వార్త ):



యాదగిరిగుట్ట పట్టణంలో జరిగిన 5 రాష్ట్రాలలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచేరిలఎన్నికలలో బీజేపీ అత్యధిక మెజారిటీ తో విజయం సాధించిన సందర్బంగా పార్టీ శ్రేణులు టపాకాయలు కాల్చుతూ, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్బంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ హిందుత్వం ఒక మతం కాదని అది ఒక జీవన విధానం అని ఆయన అన్నారు. దానిని ఎవరైన కించపరిచే విధంగా మాట్లాడితే ఎవరు సహించరని దీనిని బట్టి అర్థం చేసుకోవాలని అయన అన్నారు. పట్టణాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతు ప్రస్తుతం దేశం బీజేపీ వైపు చూస్తుందని అయన అన్నారు. తెలంగాణ లో సైతం రానున్నది బీజేపీ ప్రభుత్వం అని ఆయన జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు గుంటిపల్లి సత్య నారాయణ, రంగా సత్యం, బాను ప్రకాష్, భాస్కర్, చంద్రమోళి,బీజేపీ కౌన్సిలర్ బోధ రాధ సురేష్,జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమోళి,పట్టణ మాజీ అధ్యక్షులు శ్యామ్, మండల మాజీ అధ్యక్షులు సత్యం పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజూ నరేష్, కార్యదర్శులు దొమ్మాట ప్రభాకర్, ఆలేటి కర్ణ, సీనియర్ నాయకులు తాళ్ల భాస్కర్ రెడ్డి, మిట్ట వీరేశం, బెలిదే అశోక్ , నంగునూరి బాలరాజు, అజయ్, బాలు, వంశీ , విజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి

### మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్



**హుజూర్ నగర్ టౌన్, మే 4, ప్రభాతవార్త :** మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో హుజూర్ నగర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మున్సి పల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని గోవిందపురంలో లక్ష రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులకు ఆయన 8వ వార్డ్ కౌన్సిలర్ కోలా ఉదయ భానుతో కలిసి అయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అభివృద్ధిలో అన్ని వర్గాలు భాగ స్వాములు కావాలని కోరారు. పురాతన దేవాలయాలను, సంస్క ృ తిని పరీక్షించుకోవాలన్నారు. 8వ వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభాను మాట్లాడుతూ వార్డు సమస్యల పరిష్కారానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమం లో కే వెంకటేశ్వర్లు,కోల నాగేశ్వర రావు, చిలకపత్తిని సౌజన్య ధనుం జయ్, గొర్రె వీరబాబు, బండారు శ్రీనివాసు తోకల ప్రభాకర్ గట్టు నాగేశ్వరరావు, పిచ్చయ్య పాల్గొన్నారు.